ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
మంగళవారం 1 సెప్టెంబర్ 2026 సంపుటి: 1 సంచిక: 76 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

2



ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెకలో ఆ మీటింగ్ జరిగింది. న్యూఢిల్లీ,ఆగస్ట్31 (సింగిడి)



ఎపి మద్యం కేసులో
## సిట్ తీరు
అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

2



పదేళ్లలో అప్పులే తప్ప
## అభివృద్ధి ఏదీ
అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

2

**8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు**
**తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు**
**అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు**
**అంబర్‌పేట సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి)

# నిలబడతాడా... తడబడతాడా!



## పవర్ స్టార్ కి పరీక్ష.... ఎమ్మెల్సీ బరిలోకి జనసేన
### పట్టభద్రుల స్థానంలో పోటీ... యాక్టర్, డాక్టర్ ల ఛరిష్మాకు ఓట్లు పడేనా..?

పవన్ కళ్యాణ్...ఈ పేరు చెప్తే ఫ్యాన్స్ ఊగిపోతారు. ఆయన చరిష్మా అలాంటిది. పవర్ స్టార్ గా ఎనలేని ఫ్యాన్ ఫాలోయింగ్ ఆయనుకుంటుంది. ఆయన నిర్మించిన సొంత పార్టీ 'జనసేన' మొదట్లో తడబడ్డా.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో తిరుగులేని రాజకీయ శక్తిలా మారింది.ఏకంగా పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచి ఉపముఖ్యమంత్రి స్థానాన్ని పవన్ కైవసం చేసుకున్నారు. అయితే ఇది జరిగి దాదాపు మూడేళ్లు కావస్తున్నది. అప్పుడున్న చరిష్మా ఆయనకు ఇప్పుడు ఉండకపోవచ్చు.ఇక తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి తన సామాజిక వర్గ ఓట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పాగా వేయాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న చరిష్మా ఇప్పుడు ఉంటుందా..? తెలంగాణలో పవన్ కళ్యాణ్ కు ఓట్లు కలిసి వస్తాయా... ? ఇది ఓ రకంగా తెలంగాణలో పవర్ స్టార్ కు ఓ పెద్ద పరీక్షే.

(భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో - సింగిడి)



2

ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరం ఇప్పటి నుంచే ఆసక్తికరంగా మారుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య పోటీకి జనసేన కూడా రంగంలోకి దిగింది. మాజీ హెల్త్ డైరెక్టర్, జనసేన పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా ముందుగానే ప్రకటించడం ద్వారా జనసేన ప్రచారంలో ఇతర పార్టీల కంటే ముందడుగు వేసింది. మూడు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రులను కలుసుకోవడం, యువత––ఉద్యోగులు––నిరుద్యోగుల సమస్యలను తన ప్రచార అజెండాగా మలచుకోవడం ద్వారా పార్టీ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. అందుకోసం నియోజకవర్గాల వారీగా సమీక్షలు, సమావేశాలు, యూత్ తో స్పెషల్ మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోటీలో గెలుపా..? ఓటు శాతమా..? ప్రత్యామ్నాయ రాజకీయానికి పునాదా..? అన్నది ఖమ్మం––వరంగల్––నల్గొండ పట్టభద్రుల తీర్పే జనసేన తదుపరి రాజకీయ అడుగుకు దిశ చూపనుంది.

**సంచలనం కానుందా..!**

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేనకు ఇది కీలకమైన తొలి పరీక్ష. గెలుపు సాధిస్తే అది రాజకీయంగా సంచలనమే.

## కృష్ణా జలాలు దోచుకుపోతుంటే చోద్యం
ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు



2

**హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి):** కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు.



## ధరణి కన్నా దరిద్రంగా భూభారతి
22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు
ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది
సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు
### మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాకలు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

- మహబూబ్‌నగర్, ఆగస్ట్31 (సింగిడి)

2



## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్
ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు
'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు

2

హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి.

హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి)

TELANGANA RISING GLOBAL SUMMIT

# ఎకరాల్లెక్క అమ్మిుడే!
## హామీల కోసం ప్రభుత్వ భూముల అమ్మకాలు

బీఆర్ఎస్ వేలల్లో అమ్మిందన్న మహేష్ కుమార్ గౌడ్
కాంగ్రెస్ వందల్లోనే విక్రయిస్తోందన్న టీపీసీసీ చీఫ్
రూ. వేల కోట్ల కోసం ఎకరాల బాట
పార్టీల హామీలకు ప్రజల ఆస్తులే ఆధారమా?

ప్రభుత్వ భూముల అమ్మకాలపై తెలంగాణలో మరోసారి రాజకీయ మాటల యుద్ధం మొదలైంది. మేము వందల్లో భూములు వేలం వేసి అమ్ముతున్నాం.. గత బీఆర్ఎస్ హయాంలో వేలల్లో భూములు వేలం వేసి అమ్మారు అంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. దీంతో అసలు లెక్కలేంటి? ఎవరి హయాంలో ఎన్ని ఎకరాలు చేతులు మారాయి? అన్న చర్చ మొదలైంది. అధికారంలోకి రావాలి.. ప్రజలకు హామీలు ఇవ్వాలి.. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. మరి వాటికి నిధులు ఎక్కడి నుంచి? ఆదాయం పెంచుతారా? లేక ప్రభుత్వ ఆసులనే విక్రయిసారా? తెలంగాణలో ఇప్పుడు ఇదే కీలక ప్రశ్న.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి



**లెక్కలు తేలాలి..**

కాంగ్రెస్ ప్రభుత్వం భూములు అమ్ముతోందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తుంటే.. గత పాలనలోనూ పెద్దఎత్తున విక్రయాలు జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమ్మింది ఎవరు? ఎన్ని ఎకరాలు? వచ్చిన ఆదాయం ఎంత? ఆ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి? అన్న వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది.

**బీఆర్ఎస్ హయాంలో..**

గత పదేళ్లలో HMDA, TSIIC తదితర సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ పరిసరాల్లో విలువైన స్థలాలను వేలం వేశారు. కోకాపేట, బుద్వేల్, రాజేంద్రనగర్, రాయదుర్గం, ఖానామెట్ వంటి ప్రాంతాల్లో విక్రయాలు జరిగాయి. మొత్తంగా 1,000 ఎకరాలకు పైగా భూములు అమ్మినట్లు రాజకీయ, వివిధ నివేదికల అంచనాలు ఉన్నాయి.

**కాంగ్రెస్ పాలనలో..**

2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా భూముల వేలం కొనసాగుతోంది. HMDA, TGIIC పరిధిలోని విలువైన స్థలాలను విక్రయిస్తూ నిధులు సమీకరిస్తోంది. ఇప్పటివరకు జరిగిన వేలాల్లో 100 నుంచి 150 ఎకరాల వరకు విక్రయాలు జరిగాయని వివిధ అంచనాలు చెబుతున్నాయి.

**2,600 ఎకరాల ప్లాన్?**

ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సమీకరణలో భాగంగా హౌసింగ్ బోర్డు, DIL పరిధిలోని సుమారు 2,600 ఎకరాలను విక్రయించే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ ఆస్తులను నగదుగా మార్చే విధానంపై మరోసారి చర్చ మొదలైంది.

**హామీలకు.. భూములే బలి?**

ఎన్నికల హామీల అమలుకు నిధులు అవసరమే. కానీ వాటి కోసం ప్రభుత్వ ఆస్తులను వరుసగా విక్రయించడం ఎంతవరకు సమంజసం? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పార్టీలు పోటీ పడి హామీలు ఇవ్వడం.. వాటిని నెరవేర్చేందుకు భూములు అమ్మడం.. ఆస్తులు తగ్గి అప్పులు పెరిగితే చివరకు భారం మోయాల్సింది ప్రజలేనన్న ఆందోళన ఉంది. హామీలకు ముందే ఆదాయ మార్గాలు.. ప్రభుత్వ భూముల విక్రయాలకు మాత్రం స్పష్టమైన లెక్కలు ఉండాలన్నదే ఇప్పుడు ప్రధాన డిమాండ్.

## చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు.

హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి)

2

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు
త్వరలో జిల్లాలకు సేవల విస్తరణ
వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి)

## తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు

శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
జీవితంలో ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
నాలుగేళ్లు ఇడి, సిబిఐ కేసలుతో జైలులో పెట్టారు
నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగానికి గురి
నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు

2



భగీరథ ప్రయత్నంతో
## కరువు సీమకు కృష్ణమ్మ
### 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం



నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
2028లో రెండోదశ పూర్తి... మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం

2

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగు ఓ నిజం
Singidi
మంగళవారం
1 సెప్టెంబర్ 2026

# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ

రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి



1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు.కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## ఎపి మద్యం కేసులో సిట్ తీరు

**న్యూఢిల్లీ,ఆగస్ట్31 (సింగిడి):**

ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే సీరియస్‌గా ఉన్నారా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడిగారని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశమే లేదని పేర్కొంది. కస్టోడియల్ ఇంటరాగేషన్ కోరితే.. జడ్జి మీకు ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చారు కదా అని కోర్టు అడిగింది. పోలీసు కస్టడీకి ప్రిపేర్ కాలేదు.. జ్యుడిషియల్ కస్టడీ ఇవ్వమంటున్నారు.. ఇదేం ప్రవర్తన అని ప్రశ్నించింది. ప్రొడక్షన్ వారెంట్.. అరెస్ట్ వారెంట్‌తో సమానం పేర్కొంది.మరోవైపు ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం వాయిదా వేసింది.

## ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

**22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు**

**ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది**

**సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా**

**సిద్ధిపేట,ఆగస్ట్31 (సింగిడి):**

భూమి వివరాల కోసం బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 03 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ఎ□-లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. మ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామ చందర్ రావు సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు, పేదలకు న్యాయం అన్నారని ఆ పార్టీ నేతలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. కానీ ఇప్పుడు పేదలు, రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పయింది సరి చేస్తామన్నారని చెప్పారని.. కానీ పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. □భూములు విక్రయిస్తేనే రాష్ట్రాభివృద్ధి అంటున్నారని రేవంత్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూమి విక్రయాలను గొప్పగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 22 ఏ రైతుల భూమి మీద పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు కష్టం వస్తే తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూభారతి తెస్తే రైతు కష్టం తీరుతుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు, రెవెన్యూ మంత్రి భూములు కూడా 22 ఏలో పడ్డాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు ఇప్పుడు ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు. గుంపు మేస్త్రి దరఖాస్తు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. మీ భూములు ఏ దరఖాస్తులు లేకుండా 22 ఏలో నుంచి ఎలా తీసేస్తారని ఈ సందర్భంగా వారిని సూటిగా ప్రశ్నించారు. మరి రైతుల భూములు ఎందుకు తియడం లేదని వారిని సందేహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరిట భూములు లాక్కున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇక్కడి భూములు విక్రయించి.. ఆ సూట్ కేసులు ఢిల్లీకి మోస్తున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ◌ంకో ఏడాది అయితే కాంగ్రెస్‌లో కార్యకర్తలు ఎవ్వరు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ లోగా 22 ఏ జీవో తొలగించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని ఎంపి రఘునందన్ రావు హెచ్చరించారు.

## చంచల్‌గూడ జైలులో
## రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

**హైదరాబాద్,ఆగస్ట్31 (సింగిడి):**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయా జిల్లాలకూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలు విస్తరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలుపై కఠిన నిఘా ఉంచుతున్నట్లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తెలంగాణలో 477 ఏఆర్‌టీ, సరోగసీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు మంత్రి దామోదర వెల్లడించారు. 379 ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేశామని చెప్పారు. 50 చోట్ల డీవియేషన్స్ గుర్తించామని తెలిపారు. 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామని.. 9 సెంటర్ల అనుమతులు తాత్కాలికంగా రద్దు చేశామని చెప్పుకొచ్చారు. ఫెర్టిలిటీ సేవల పేరుతో రోగులపై అనవసర ఆర్థిక భారం వద్దని అన్నారు. గాంధీ, పేట్లబురుజు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై మంత్రి సమీక్షించారు. రెండు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్లలో 39,802 మందికి ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లు మంత్రి దామోదర తెలిపారు. 545 ఐవీఎఫ్ కేసులు, 521 ఐయూఐ ప్రక్రియలు పూర్తి చేసినట్లు వివరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నుంచి జులై మధ్యలో హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో 2,600 తనిఖీలు నిర్వహించామని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# నిలబడతాడా... తడబడతాడా!

అయితే గెలుపు సాధించకపోయినా గణనీయమైన ఓటు శాతం సాధించడం ద్వారా తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడానికి పునాది వేసుకోవచ్చన్నది జనసేన వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే అభ్యర్థిని ప్రకటించి ప్రచారానికి ఎక్కువ సమయం దక్కించుకుంది. అయితే 2024 ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 1,22,813 తొలి ప్రాధాన్యత ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి 1,04,248, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు వచ్చాయి. ఎవరికీ 50 శాతం రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఈ ఫలితం పోటీ ఎంత హాట్ గా ఉంటుందో స్పష్టం చేసింది. ఈసారి జనసేన ప్రవేశంతో ఓట్ల విభజన మరింత కీలకం కానుంది. జనసేనకు వచ్చే ఓట్లు ప్రధానంగా ఏ పార్టీ నుంచి చీలుతాయన్నదే ఫలితాన్ని ప్రభావితం చేసే అంశంగా మారవచ్చు.

**అన్ని పార్టీలకూ పరీక్ష..!!**

ప్రస్తుత అధికార పార్టీగా కాంగ్రెస్‌కు సంస్థాగతంగా, రాజకీయంగా బలం ఉంది. గత ఉపఎన్నికలో విజయం సాధించడం ఆ పార్టీకి అదనపు బలం. అయితే పట్టభద్రుల ఓటరు సాధారణ పార్టీ ఓటరుతో పోలిస్తే ప్రభుత్వ పనితీరును ఎక్కువగా ప్రశ్నించే అవకాశం ఉంది. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగం, విద్య, నియామకాలు, యువత భవిష్యత్తు వంటి అంశాలు కాంగ్రెస్‌కు అనుకూలమా.. ప్రతికూలమా అన్నది ఎన్నికల సమయంలో తేలనుంది. బీఆర్ఎస్‌కు పాత సంస్థాగత పునాది ఉంది. గత ఉపఎన్నికలో లక్షకు పైగా తొలి ప్రాధాన్యత ఓట్లు సాధించడం ఆ పార్టీకి పట్టభద్ర వర్గంలో ఉన్న బలాన్ని సూచించింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును తనవైపు తిప్పుకోవడంతో పాటు జనసేన, బీజేపీ వైపు వెళ్లే యువ ఓటును నిలబెట్టుకోవడం బీఆరఎస్‌కు కీలకమని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక బీజేపీ గత ఎన్నికలో మూడో స్థానంలో నిలిచినా 43 వేలకు పైగా తొలి ప్రాధాన్యత ఓట్లు సాధించింది. పట్టభద్రులు, ఉద్యోగులు, మధ్యతరగతి, యువతలోని ఒక వర్గంలో ఉన్న మద్దతు ఆ పార్టీకి బలంగా ఉంది. అయితే జనసేన రంగంలోకి రావడం వల్ల ముఖ్యంగా పవన్ కల్యాణ్ అభిమానులు, యువ ఓటర్లలో కొంత భాగం జనసేన వైపు మళ్లితే బీజేపీ ఓటు శాతంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

**ఇమేజ్ నుండి ఓటు.. ?**

జనసేనకు పవన్ కల్యాణ్ ఇమేజ్ ప్రధాన బలం. ముఖ్యంగా యువతలో ఉన్న అభిమానాన్ని గడల శ్రీనివాసరావు తనకు అనుకూల ఓటుగా మలచుకోగలిగితే జనసేనకు గణనీయమైన లాభం కలగవచ్చు. అయితే అభిమానం మాత్రమే ఓటుకు హామీ కాదు. అభ్యర్థి వ్యక్తిగత విశ్వసనీయత, పట్టభద్రుల సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే నాయకుడిగా ఉన్న ఇమేజ్ కూడా కీలకం కానుంది. ఖమ్మం ప్రాంతంలో గడల శ్రీనివాసరావుకు ఉన్న వ్యక్తిగత పరిచయం, జనసేనకు పవన్ ఇమేజ్ కొంత బలం ఇవ్వవచ్చన్న అభిప్రాయం వినపిస్తోంది. వరంగల్--హనుమకొండ ప్రాంతాల్లో ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్య, యువత సమస్యలు ప్రభావం చూపే అవకాశం ఉంది. నల్గొండ--సూర్యాపేట ప్రాంతాల్లో కాంగ్రెస్, బీఆరఎస్‌ల పాత రాజకీయ పునాదులు కీలకంగా మారవచ్చు. మూడు ప్రాంతాల్లోనూ అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, స్థానిక కేడర్, ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి.

**ఏ ఓటరు ఎవరి వైపు..?**

జనసేనకు వచ్చే ఓట్లు ఏ పార్టీని ఎక్కువగా దెబ్బతీస్తాయన్నది ఇప్పుడు ప్రధాన చర్చ. యువతలోని ప్రభుత్వ వ్యతిరేక ఓటు జనసేన వైపు మళ్లితే కాంగ్రెస్‌కు నష్టం కలగవచ్చు. బీజేపీకి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్న పవన్ అభిమాన వర్గం జనసేన వైపు వస్తే ఆ పార్టీకి ప్రభావం పడవచ్చు. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్నా కాంగ్రెస్‌ను ప్రత్యామ్నాయంగా చూడని ఓటర్లు జనసేన వైపు మళ్లినా ఆ పార్టీకి నష్టం తప్పదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో రెండో ప్రాధాన్యత ఓట్లు అత్యంత కీలకం. గత ఎన్నికలోనూ తొలి ప్రాధాన్యతలో ఆధిక్యం ఉన్నప్పటికీ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ద్వారా విజయం నిర్ణయమైంది. ఈసారి నాలుగు శక్తుల మధ్య పోటీ గట్టిగా జరిగితే చిన్న పార్టీలకు, స్వతంత్రులకు వచ్చే ఓట్లు కూడా చివరి దశలో కీలకంగా మారే అవకాశం ఉంది.

**ఓట్లుగా మార్చడమే ప్రధానం.**

మొత్తంగా కాంగ్రెస్‌కు అధికార బలం, బీఆర్ఎస్‌కు కేడర్ పునాది, బీజేపీకి నిర్దిష్ట వర్గాల్లో ఓటు మద్దతు ఉండగా.. జనసేనకు పవన్ కల్యాణ్ ఇమేజ్, డాక్టర్ గడల వ్యక్తిగత పరిచయం ప్రధాన బలాలుగా కనిపిస్తున్నాయి. అయితే ఈ బలాలను ఓట్లుగా మార్చడమే జనసేనకు అసలు పరీక్ష. పవన్ ఇమేజ్‌ను ఓటుగా.. గడల వ్యక్తిగత పరిచయాన్ని బలంగా.. పట్టభద్రుల సమస్యలను ఎన్నికల అజెండాగా మార్చగలిగితే జనసేన నాలుగో శక్తిగా నిలబడే అవకాశం ఉంది. లేకపోతే ప్రధాన పార్టీల మధ్య ఓట్లను చీల్చే మరో రాజకీయ శక్తిగానే మిగిలిపోవచ్చు. గెలుపా..? ఓటు శాతమా..? ప్రత్యామ్నాయ రాజకీయానికి పునాదా..? ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల తీర్పే జనసేన తదుపరి రాజకీయ అడుగుకు దిశ చూపుతుందేమో వేచిచూడాలి.

## కృష్ణా జలాలు దోచుకుపోతుంటే చోద్యం

నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్సలో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెటెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ రావు అన్నారు.

## భగీరథ ప్రయత్నంతో కరువు సీమకు కృష్ణమ్మ

**మార్కాపురం, ఆగస్టు 31 (సింగిడి)**

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జల హారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు.

## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యా సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణసోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వేహబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేందప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వే స్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బులెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కి చెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బులెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్టను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు

**నిజామాబాద్,ఆగస్ట్31 (సింగిడి):**

తెలంగాణ కోసం కష్టపడ్డ తనను అన్యాయంగా బయటకు గెంటేశారని, ఎంతో కష్టపడి పార్టీ అధికారంలోకి వచ్చేలా చేసిన సొంత పార్టీలోనే నాకు స్థానం లేకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని ఆమె దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని ఆరోపించారు. ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు అని కవిత చెప్పారు. ఈ గడ్డ బిడ్డగా ఇక్కడ మిమ్మలను చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందే నని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు.



# ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.3.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, ఆగస్టు 31 (సింగిడి):** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇస్నాపూర్, చిట్కుల్, లకడారం వార్డుల్లో రూ. 3 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి



పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**నాణ్యతతో.. వేగంగా పనులు**

శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పాండు, నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, ఈశ్వరమ్మ, జనార్ధన్ రెడ్డి, ఆంజనేయులు, మమత అరుణ్, రాజు, లత వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సోనియా రాజు, నిజాముద్దీన్ బాబా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేరాజ్ ఖాన్, కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పడాలి

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ వొక్షిత్ హిల్ వ్యూ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నరేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను వారు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలు



తదితర అంశాలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ చైర్మన్ సోమిరెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు రామ నాయుడు, కుమార్, రవితేజ, శ్రీధర్ గౌడ్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకానగర్‌లో మల్టీపర్పస్ హాల్‌కు శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల సర్కిల్ 284వ డివిజన్ ద్వారకా నగర్ లో నూతనంగా నిర్మించ తలపెట్టిన మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పనులు ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో 21.50 లక్షల నిధులు మంజూరు కావడంతో ఈ మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ



కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కే.ఎం. గౌరీష్, ఐ ఎన్ టి యు సి ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టంపల్లి సురేందర్ రెడ్డి, మోతే శ్రీనివాస్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైస్ ప్రెసిడెంట్, 284వ డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఖయ్యూం, డి సి సి మైనార్టీ సభ్యులు జాకీర్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుజాత, డివిజన్ సీనియర్ నాయకులు రమేష్, రామ్ రెడ్డి, అక్బర్, భగవాన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వై. రాజు, హఫీజ్, జెస్సి, జ్యోతి, కాలనీ అధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు బాలయ్య, రాజు, కృష్ణ, సంగమ్మ పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో రాజేందర్ రెడ్డికి పీహెచ్.డీ.



**పటాన్చెరు, ఆగస్టు 31 (సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వై. రాజేందర్ రెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'లక్షిత ఆంకాలజీ ఔషధాలైన ఇబ్రూటినిబ్, బుసుల్ఫాన్, లాపటినిబ్, రుక్సోలిటినిబ్ లలో మలినాల ప్రొఫైలింగ్, నిర్మాణ వివరణ కోసం అధునాతన విశ్లేషణాత్మక పద్ధతుల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి పరిశోధన, ఇబ్రూటినిబ్, బుసల్ఫాన్, లపాటినిబ్, రుక్సోలిటినిబ్ అనే నాలుగు ముఖ్యమైన ఆంకాలజీ ఔషధాలపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. వాటి స్థిరత్వాన్ని అంచనా వేయడానికి, విచ్ఛిన్న ఉత్పత్తులను, ప్రక్రియ-సంబంధిత మలినాలను గుర్తించడానికి, ఇంకా వాటి నిర్మాణాలను విశ్లేషించడానికి అధునాతన విశ్లేషణాత్మక పద్ధతులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రిపరేటివ్ క్రోమాటోగ్రఫీలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ అధ్యయనం మలినాలు ఏర్పడటానికి గల సంభావ్య యంత్రాంగాలను కూడా స్థాపించిందన్నారు. ఇది ఔషధ భద్రత, నాణ్యత, నియంత్రణలను మెరుగుపరచడానికి దోహదపడినట్టు వివరించారు. ఈ పరిశోధన, విశ్లేషణాత్మక ఖచ్చితత్వానికి ఎటువంటి రాజీ పడకుండా, నమూనా పూర్వ-శుద్ధీకరణ, సంక్లిష్ట సంగ్రహణ ప్రక్రియలను తగ్గించడం ద్వారా, సరళమైన, తక్కువ ఖర్చు, పర్యావరణ స్పృహతో కూడిన విశ్లేషణాత్మక విధానాన్ని మరింత వెల్లడించిందన్నారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించడమే గాక, ఔషధ రసాయన శాస్త్ర పరిశోధనకు ఆయన చేసిన విలువైన కృషిని ప్రశంసినట్టు వివరించారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకితభావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు ప్రొఫెసర్ సురేంద్ర బాబును కూడా అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కలెక్టరేట్ ప్రజావాణికి 41 ఫిర్యాదులు

**ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి**

**అదనపు కలెక్టర్లు సంగీత, పాండు**



**సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు 31(సింగిడి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయనీ, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్ 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితురాలు అరెస్ట్




**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31(సింగిడి):** ఒంటరిగా నివసిస్తున్న మహిళలు, వితంతువులు, వృద్ధ దంపతులను టార్గెట్ చేసుకుని వారి దృష్టి మరల్చి బంగారు ఆభరణాలు దొంగలిస్తున్న అంతర్రాష్ట్ర కిలాడి లేడిని తాండూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులు, కర్ణాటక రాష్ట్రంలో 3 కేసులు ఛేదించారు. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించిన వికారాబాద్ సీసీస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో మహిళలు, వృద్ధుల భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న నేరాలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోటుచేసుకున్న దొంగతనాల కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వికారాబాద్ సీసీస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఈ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతరం దర్యాప్తు చేపట్టారు. నేరాలు జరిగిన ప్రాంతాలు, నేరాల తీరును క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితురాలి కదలికలను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వివిధ ప్రాంతాల్లో నిందితురాలి కదలికలు, గతంలో ఆమె పాల్పడిన నేరాల వివరాలు, నేరం చేసిన విధానం తదితర అంశాలను విశ్లేషించారు. ఈ క్రమంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర నిందితురాలిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితురాలు ప్రధానంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను గుర్తించి వారిని లక్ష్యంగా చేసుకునేది. ముందుగా వారితో పరిచయం ఏర్పరచుకుని, వివిధ విషయాలపై మాట్లాడటం, వారి దృష్టిని మరల్చడం వంటి పద్ధతులను ఉపయోగించి, వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులు తదితర ఆభరణాలను అపహరించడం రివాజుగా మారిందని అన్నారు. నిందితురాలు ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి కూడా ఇదే తరహాలో నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ నేతృత్వంలో చేపట్టిన దర్యాప్తులో నిందితురాలి నేరాలకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించి, ఆమె ప్రమేయం ఉన్న కేసులను గుర్తించారు. తాండూరు టౌన్ పీఎస్ పరిధిలో 5 కేసులు ఛేదించిన్నట్లు తెలిపారు. 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. తాండూరు కేసుల దర్యాప్తు సందర్భంగా నిందితురాలు గతంలో కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, నవనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో మొత్తం 14.5 తులాల బంగారు ఆభరణాల దొంగతనాలకు సంబంధించి కూడా నిందితురాలి ప్రమేయం ఉన్నట్లు అధికారులు దర్యాప్తులో గుర్తించారు. వరుసగా నమోదైన ఈ కేసులను ఛేదించేందుకు వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ప్రత్యేక బృందంతో కలిసి నిరంతరం దర్యాప్తు చేపట్టారు. నేరం జరిగిన ప్రాంతాలు, బాధితుల వివరాలు, నేరం జరిగిన విధానం, నిందితురాలి కదలికలు, సాంకేతిక ఆధారాలు తదితర అంశాలను సమగ్రంగా విశ్లేషించి, కేసుల మధ్య ఉన్న సారూప్యతలను గుర్తించారు. తాండూరులో నమోదైన కేసులకు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసులకు మధ్య ఉన్న నేర విధానాన్ని పోల్చి పరిశీలించడం ద్వారా నిందితురాలి ప్రమేయాన్ని గుర్తించడం జరిగింది. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ నిరంతర కృషి, సమర్థవంతమైన దర్యాప్తు, సాంకేతిక ఆధారాల విశ్లేషణ ఫలితంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. సీసీఎస్ అధికారులు నిందితురాలి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నిందితురాలిపై గతంలో మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఎంఐడిసీ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, బర్షి పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, హైదరాబాద్ సిటీ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదైనట్లు గుర్తించారు. ఈ కేసుల దర్యాప్తును ప్రత్యేకంగా పర్యవేక్షించిన వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, తాండూరు టౌన్ ఎస్ ఐ మమత ఆధ్వర్యంలో హెచ్ సీ లు జయవర్ధన్, శివకుమార్, పీసీ లు రామకృష్ణ, సాయప్ప, శివరాజ్, పాండు, రాజు, రవీందర్ మరియు డబ్ల్యూపీసీ గాయత్రి సమన్వయంతో పనిచేశారు. ఈ కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా అభినందించారు.

# తోర్నాల గ్రామంలో సహస్ర ఘటాభి షేకం

**కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్, కల్వకుంట్ల వంశీధర్ రావు**



**సిద్దిపేట ప్రతినిధి, ఆగస్టు 31(సింగిడి):** సిద్దిపేట జిల్లా రూరల్ మండలం తోర్నాల గ్రామంలో శివ రామాంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న సహస్ర ఘటాభిషేకం పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సారి వర్షాలు సకాలంలో కురువాక పోవడంతో రైతన్నలు ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దేవుని ఆశీస్సులు ఈ తోర్నాల గ్రామం పై ఎల్లవేళలా ఉండాలని సకాలంలో వర్షాలు కురవాలని పంటలు అధిక మొత్తంలో పండాలని గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారడం జరిగిందన్నారు. ప్రతి ఏటా గ్రామ ప్రజలు శ్రావణ మాసంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెయ్యి బిందెలతో లింగన్ని ఘటాభి షేఖం చేస్తారని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**మరో ఇద్దరికి గాయాలు**




**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31(సింగిడి):** జిల్లా పరిధిలోని పరిగి, కొడంగల్ రహదారి పై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పరిగి ఎస్ ఐ మోహన కృష్ణ కథనం ప్రకారం పరిగి, కొడంగల్ రహదారి చింతల్ చెరువు మలుపు వద్ద ఆగి ఉన్న లారీ నెం కె ఏ 23, బి,2256 ను వెనకనుండి వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారు నెం ఏ పి 28, సీ సీ 2996 బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు మహిళలు దోమ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఖాజాబీ (70), అదే గ్రామానికి చెందిన జహాంగీర్ బి (65) తీవ్ర గాయాలకు గురై అక్కడి అక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు అబ్దుల్ హయ్, ఆర్ ఎం పి డాక్టర్, మరో యువకుడు అబ్దుల్ ఆర్ఫాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నాగారం డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం
- నాగారం మాజీ చైర్మన్ చంద్రరెడ్డి

**కీసర ఆగస్టు 31 (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నాగారం డివిజన్ పరిధిలోని పలు ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు, రాంపల్లిలో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను త్వరగా ప్రారంభించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం డివిజన్ పరిధిలోని చర్లపల్లి నుండి రాంపల్లి వరకు, రాంపల్లి చౌరస్తా నుండి యన్నంపేట వరకు, అలాగే రాంపల్లి నుండి బొగారం వరకు ఉన్న ప్రధాన రహదారులపై సరైన వీధిదీపాల సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తగినంత వెలుతురు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని అన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో



ఉంచుకొని ప్రధాన రహదారుల వెంట తక్షణమే సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. అలాగే నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో గత సంవత్సరం 2025 జనవరిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు శంకుస్థాపన చేసినప్పటికీ, ఇప్పటివరకు ప్రారంభించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రాకపోవడంతో ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాంపల్లి యుపిహెచ్ సి పనులను త్వరితగతిన పూర్తి చేసి, వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరం లక్ష్మి , మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షుడు బుధవరం వేణుగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి , పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వల్లాల శ్రీనివాస్ గౌడ్, రామారం గిరి గౌడ్ , కార్యదర్శి సురేందర్ రెడ్డి, బిఎస్ఎన్ఎల్ రమేష్, పెద్దిరెడ్డి ప్రసాద్, సూర్వి రాజు గౌడ్, భరత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
1-9-2026

Editorial

# ఎడిటోరియల్

# జవాబు దారి తనం ఏదీ... ?

## క్యాంప్ కార్యాలయం వేదికగా జరిగే వాటికి ఎవరిది బాధ్యత ??

**భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో క్లర్క్‌గా (సి సి ) ఉన్న కళ్యాణ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించి కోట్ల రూపాయలు వసూలు చేసి పరారయ్యాడు. ఈ ఘటన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా ఉంది. ఈ ఘటన ఆధారంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. పరారైన కళ్యాణ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం!**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ తెల్లం వెంకటరావు బిఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆనాడు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధిగా ఉన్న ముఖ్య నాయకుడి సిఫారసు మేరకు కళ్యాణ్ అనే ఉద్యోగిని ఎమ్మెల్యే వెంకటరావు తన క్యాంప్ కార్యాలయం క్లర్క్ (సి సి ) నియమించుకున్నారు. నాటి నుండి సిసిగా ఉన్న కళ్యాణ్ క్యాంప్ కార్యాలయం వేదికగా తన పరిచయాలను, పరపతిని పెంచుకోసాగాడు. ముఖ్యమైన కాంగ్రెస్ నాయకులందరికీ బాగా దగ్గరయ్యాడు. వారి వారి వ్యక్తిగత పనులు చేసిపెట్టడం, అనధికార పైరవీలు చేయడం ద్వారా కళ్యాణ్ కొందరికి ఆత్మీయుడయ్యాడు. ఆ పరిచయాలను ఉపయోగించుకుని భారీ మోసాలకు ప్రణాళిక వేసాడు. పలువురి దగ్గర వివిధ ప్రభుత్వ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తా అంటూ సుమారు పది కోట్ల రూపాయలు మేర వసూలు చేసినట్లు సమాచారం ! నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు కూడా సృష్టించి కొందరికి ఇచ్చాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరువురు పంచాయతీ వార్డు సభ్యులు, ఎమ్మెల్యే గన్‌మెన్ కూడా ఉద్యోగాల కోసం అని చెప్పి కళ్యాణ్‌కి లక్షల్లో డబ్బులు ఇచ్చారు. ఏ కారణం చేతనో కానీ తర్వాత ఆ డబ్బులను వెనక్కి తీసేసుకున్నారు. విచిత్రం ఏమంటే ఇంత జరుగుతున్నా ఈ వ్యవహారం ఎమ్మెల్యే దృష్టికి రాకపోదు కళ్యాణ్ వ్యవహారంతో తనకేమీ సంబంధంలేదని, తన దృష్టికి రాగానే తనను సరెండర్ చేస్తూ కలెక్టర్‌కు లేఖ రాశానని డాక్టర్ వెంకట్రావు చెపుతున్నారు. తనపై బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. కళ్యాణ్ పోలీస్ కస్టడీలో ఉన్నాడని, పోలీసులు దర్యాప్తు చేస్తారని ఆయన చెప్పారు. తాను ఎటువంటి అవినీతి, అక్రమాలను ప్రోత్సహించనని, గతం లో తన ముఖ్య అనుచరుడుగా ఉన్న నవాబ్‌పై ఆరోపణలు తన దృష్టికి రాగానే దూరం పెట్టినట్లు ఎమ్మెల్యే వెంకట్రావు పేర్కొన్నారు.

తెల్లం వెంకటరావు తన ఉద్యోగానికి 2013 లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో మహబూబ్‌బాద్ లోక్‌సభ స్థానం నుండి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత టిఆర్ఎస్ పార్టీలో చేరి 2018 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 ఎన్నికల సమయంలో తన రాజకీయ గురువుగా చెప్పుకునే పొంగులేటి శ్రీనివాస రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ రాకపోవడంతో చివరి నిమిషంలో తిరిగి గులాబీ గూటికి చేరి 2023 ఎన్నికల్లో పోటీ చేసిన డాక్టర్ వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

వెంకట్రావుకు వైద్య వృత్తిలో ఒక జనరల్ సర్జన్‌గా చాలా మంచి పేరు ఉంది. ఆయన పనిచేసిన ప్రాంతాల్లో ప్రజలు ఎంతో ఆదరాభిమానాలు చూపిస్తారు. ఎమ్మెల్యే కావాలనే కోరికతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన వెంకటరావు తొలి పోటీ లోనే గెలుస్తున్నారనే ప్రచారం జరిగింది. అనూహ్య పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపొందారు. 2023 ఎన్నికల్లో మంచి వ్యక్తి, అందరితో కలివిడిగా ఉంటారు, నైపుణ్యం ఉన్న వైద్యుడు ఎమ్మెల్యేగా గెలిస్తే అభివృద్ధి బాగుంటుందని భావించి అనేకులు అనేక రూపాల్లో సహకరించి గెలిపించారు. పలువురు ముఖ్య నాయకులు దశాబ్దాలుగా వారు పనిచేసిన పార్టీలను వదిలేసి గులాబీ కండువా కప్పుకుని వెంకట్రావుతో నడిచారు. పదవి కోసం చాలా సులభంగా పార్టీ మారుతారనే ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోలేదు. అప్పటికే పదేండ్ల కెసిఆర్ పాలనలో భద్రాచలం ప్రాంతం పూర్తి నిర్లక్ష్యంకు గురైంది. భద్రాచలం అభివృద్ధికి కేసీఆర్ చేసిన వాగ్దానాలు అమలు కాలేదు.



గిరి ప్రసాద్ సోముల, జర్నలిస్ట్

అయినా విచిత్రంగా, రాష్ట్ర వ్యాప్త కాంగ్రెస్ గాలిలో కూడా టిఆర్ఎస్ తరుపున వెంకట్రావు గెలుపొందటడం విశేషం! అనంతరం కొద్ది రోజులకే బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిపోయారు. తనకు పార్టీలు, జెండాలు ముఖ్యం కాదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పార్టీలో చేరానని వెంకట్రావు ప్రకటించారు. అయితే తను చెప్పినట్లు అభివృద్ధి ఎంత మేరకు జరిగింది అనే ప్రశ్న నిత్యం వినిపిస్తూనే ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండటం, క్యాంప్ కార్యాలయంకు ఎవరు వెళ్లినా కలసి మాట్లాడటం, డివిజన్ వ్యాప్తంగా శుభ, అశుభ కార్యక్రమాలకు హాజరవడంలో నిత్యం ఎమ్మెల్యే బిజీగా గడుపుతుంటారు. అన్ని రాజకీయ పార్టీలతోనూ, ముఖ్యం ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలుతో సఖ్యతగా ఉంటారు. అభివృద్ధి, పార్టీ వ్యవహారాల్లో సమన్వయ లోపం ఎక్కువగా ఉంటుందని కార్యకర్తలు చెపుతుంటారు. అభివృద్ధి విషయంలో నిర్దేశిత గడువు పెట్టుకుని తన పదవీ కాలంలో తనదైన మార్క్ ఉండేలా చేయడంలో లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు బ్యాంకు పెంచుకోవడం, తాను ఎదగడం, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపైనే ఎమ్మెల్యే ఎక్కువగా దృష్టి పెడుతుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు ఇప్పిస్తామంటూ కొందరు కార్యకర్తలు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడుగా ఉండే నవాబ్‌పై పలు ఆర్థిక ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అవి ముదిరిన తర్వాత నవాబ్‌ను దూరం పెట్టినట్లు చెప్పారు. నిజాయితీ పరుడు అనే పేరున్న పొదెం వీరయ్య ఎమ్మెల్యే కాలంలో తన ముఖ్య అనుచరులు దళిత బంధు రెండో విడతకు భారీగా డబ్బులు వసూలు చేశారనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ఆ ప్రచారం ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని భయపడిన వీరయ్య చాలా వరకు ఆ డబ్బులను బాధితులకు వెనక్కి ఇచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తన క్యాంప్ కార్యాలయం వేదికగా సి సి అయిన, ఎవరైనా కార్యకర్తలు అయినా డబ్బులు వసూలు చేస్తే తనకేం సంబంధం అని ఎమ్మెల్యే ప్రశ్నిస్తున్నారు. తాను నిజాయితీగా ఉన్నాను అని, సిసి కళ్యాణ్ ఆర్థిక వ్యవహారాల్లో తనకు ఎటువంటి ప్రమేయం లేదని, ప్రతిపక్షాలు కావాలనే అవాస్తవ ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే వెంకటరావు పేర్కొన్నారు. అయితే ఇంతటితోనే ఎమ్మెల్యే బాధ్యత అయిపోతుందా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తన క్యాంప్ కార్యాలయంలో జరిగే వ్యవహారాలకు జవాబు దారీ ఉండాల్సిన అవసరం లేదా అనే ప్రశ్న వినబడుతుంది. తన ముఖ్య సహచర, అనుచర, అంతరంగికులతో సమన్వయం, సహకారంతోపాటు వారి వ్యవహారాలను ఎమ్మెల్యే ఎప్పటికపుడు ఆరా తీయాల్సిన అవసరం , బాధ్యత ఉంటాయి కదా అని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ఇప్పటి కళ్యాణ్ బాధితులు ఓటు వేసిన ప్రజల్లో భాగమే కనుక వారికి న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరుతున్నారు.

# అక్షరం బందీ–బడులు ఖాళీ!

## విద్యను బలికోరి 'వికసిత్ భారత్' సాధ్యమేనా?



'వికసిత్ భారత్'... నేడు పాలకుల ప్రసంగాలలో, ప్రకటనల్లో మార్మోగుతున్న డిజిటల్ నినాదం. 2047 నాటికి భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా నిలబెడతామనే ఆర్భాటం ఒకవైపు, ప్రాథమిక విద్యావ్యవస్థ పునాదులే కదిలిపోతున్న భయానక వాస్తవికత మరొకవైపు. విద్య కేవలం అక్షరజ్ఞానం మాత్రమే కాదని, అది మానవీయ విలువలకీ, వివేకానికి, సామాజిక వికాసానికి, సమత్వానికి మూలస్తంభమని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నమ్మారు. అణగారిన వర్గాల విముక్తికి విద్యనే ఏకైక మార్గంగా చూశారు. కానీ నేడు, ఆ మహనీయుల ఆశయాలకు, నేటి ప్రభుత్వాల విధానాలకు నడుమ అంతులేనంతటి అగాధం కనిపిస్తోంది. పాఠశాలల్లో పుస్తకాలు పట్టుకుని ప్రయోగశాలల్లో మెరవాల్సిన 'జెన్ ఆల్ఫా' తరం పిల్లలు, తమ కనీస విద్యా హక్కు కోసం రోడ్డెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడటం మన పరిపాలనా వ్యవస్థ నైతిక వైఫల్యానికి స్పష్టమైన అద్దం పడుతోంది.

ఈ విద్యా సంక్షోభం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా కోసాయి ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు పదవీ విరమణ చేయగా, మరొకరు అకాల మరణం చెందారు. ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బడి తలుపులకు తాళాలు పడ్డాయి. అయినా, అక్కడ చదువుకోవాలనే ఆరాటంతో గిరిజన పిల్లలు ప్రతిరోజూ పాఠశాల ఆవరణలోనే కూర్చుని పుస్తకాలు తిరగేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారంలో తరగతి గది కూలిపోతే, ప్రత్యామ్నాయ భవనం లేక గుడిలో తరగతులు నిర్వహిస్తున్నారు. రాజస్థాన్‌లోని రాంపుర కన్వర్పురాలో విద్యార్థులు పశువుల కొట్టాల్లో కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితిపై నిరసనలకు దిగితే తప్ప ప్రభుత్వం స్పందించలేదు. అజ్మీర్, జైపూర్ లలో అపరిశుభ్ర వసతులు, పరిపాలనా వైఫల్యాలపై బాధితుల ధర్నాలు చేపట్టాల్సి వచ్చింది.

ఉత్తరప్రదేశ్‌లో బడి గోడలే కాదు, బడికి వెళ్లే దారులు కూడా విద్యార్థులకు అడ్డంకిగా మారాయి. లక్నో, ఉన్నావ్, ఫతేపూర్, కన్నౌజ్ ప్రాంతాల్లో పరీక్షలు దగ్గరపడుతున్నా సైన్స్ ఉపాధ్యాయులు లేక పిల్లలు ప్రధాన రహదారులను దిగ్బంధించారు. మహోబాలో గుంతల రోడ్లపై, గోరఖ్‌పూర్‌లో నీటమునిగిన బురద మార్గాల్లో ఈదుకుంటూ బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రదేశ్‌లో భోపాల్ సహా పలు జిల్లాల్లో సుమారు 25 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేత లేదా విలీన నిర్ణయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ అభ్యర్థులు వీధుల్లోకి వచ్చారు. బీహార్ రాజధాని పాట్నాలో ఆరేళ్ల బాలుడు ఆదిత్య బిగ్గరగా గళమెత్తి ప్రజా వ్యవస్థల వైఫల్యాన్ని ప్రశ్నించడం ఈ విద్యా ఆవేదన తీవ్రతకు ప్రతీక. పిల్లలు కోరుతోంది ఏవో అసాధారణ సౌకర్యాలు కాదు; చదువుకోడానికి ఒక గురువు, కూర్చోడానికి ఒక గది, తాగడానికి నీరు, చదవడానికి పాఠం.

ఇక్కడే పాలకుల మాటలకు, చేతలకు మధ్య ఉన్న అసలు వైరుధ్యం బయటపడుతుంది. ఒకవైపు డిజిటల్ ఇండియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), స్టార్టప్‌లు, ప్రపంచస్థాయి పరిశోధనల గురించి మైకులు పగిలేలా మాట్లాడుతున్న పాలకులు, సైన్స్ చెప్పే ఉపాధ్యాయుడు లేని పాఠశాలల వాస్తవికతను ఎందుకు విస్మరిస్తున్నారు? ప్రయోగశాలలు లేని తరగతి గదులతో జ్ఞాన సమాజం ఎలా సాధ్యమవుతుంది? ప్రాధాన్యతలకే పరిమితమైన నిధుల పంపిణీలో పిల్లల విద్యకు స్థానం ఏది? గోశాలల నిర్మాణాలకు, భారీ ప్రాజెక్టులకు వందల కోట్లు మంజూరు చేసే ప్రభుత్వాలు, కోట్లాది మంది దళిత, బహుజన, ఆదివాసీ, గిరిజన, పేద పిల్లలు చదివే ప్రభుత్వ బడులకు తగినంత బడ్జెట్ ఎందుకు కేటాయించడం లేదు?

జాతీయ విద్యా విధానం–2020 (ఎన్ఈపీ 2020) ప్రకారం దేశ జీడీపీ లో కనీసం 6 శాతం నిధులను విద్యకు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఏళ్ల తరబడి ఆ కనీస కేటాయింపులు కూడా ఆచరణలోకి రావడం లేదు. గత పద్నాలుగేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ వైఫల్యాన్ని కేవలం భాజపాపై విమర్శతో ముగించలేం. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కూడా కులం, వర్గం, ప్రాంతం ఆధారంగా ఉన్న అసమానతలను మూలాల నుంచి ఉపేక్షించి, అందరికీ సమానమైన, ఉచిత ప్రజా విద్యా వ్యవస్థను నిర్మించడంలో విఫలమైంది.


ఎన్నికల సమయంలో రాజకీయనాయకులు పరస్పరం విమర్శలు చేసుకోవచ్చు; కానీ విద్యను మార్కెట్ సరుకుగా మార్చాలా లేక పౌరుల ప్రాథమిక హక్కుగా నిలబెట్టాలా అన్నదానిపై స్పష్టత లేదు. ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడిన ప్రతిసారీ ప్రైవేటు విద్యా వ్యాపారానికి మార్కెట్ విస్తరిస్తుంది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు నాణ్యమైన విద్యను కొనుగోలు చేయగలుగుతుంటే, పేద కుటుంబాల పిల్లలు అవకాశాలకు దూరమై వెనుకబడిపోతున్నారు.

పిల్లలు బడి కోసం, హక్కుల కోసం రోడ్డెక్కడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు; కానీ పిల్లలు రోడ్డెక్కాల్సిన దుస్థితిని కల్పించడమే వ్యవస్థకు అసలైన ప్రమాదం. ప్రభుత్వాలకు తక్షణమే సమగ్ర పునర్నిర్మాణ స్పృహ రావాలి. జీడీపీలో కనీసం 6 శాతం నిధులను విద్యకు తక్షణమే కేటాయించాలి. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న లక్షలాది ఉపాధ్యాయ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి. కోసాయి వంటి ప్రాంతాల్లో వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి; అగ్రహారం వంటి చోట్ల శిథిల భవనాల స్థానంలో ఆధునిక తరగతి గదులను నిర్మించాలి. పాఠశాలల మూసివేత, విలీనం వంటి నిర్ణయాలను వెనక్కి తీసుకుని స్థానిక పాఠశాలలను బలోపేతం చేయాలి.

విద్యను కేవలం మార్కులు, ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, ప్రశ్నించే స్వేచ్ఛను పెంచేదిగా తీర్చిదిద్దాలి. పూలే చూపిన విద్యా విముక్తి మార్గాన్ని, అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వ దృక్పథాన్ని కలగలిపి ప్రజా విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి. పిల్లల చేతుల్లో నిరసన ప్లకార్డులు కాకుండా పుస్తకాలు, ప్రయోగ పరికరాలు ఉంచినప్పుడే పూలే కలలు కనిన సమసమాజం, నిజమైన 'వికసిత్ భారత్' సాకారమవుతాయి.

వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# భాషా నిలయానికి లక్ష్మీ నరసమ్మ సేవలు



నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం హైదరాబాదు లోని ప్రాచీన గ్రంథాలయము. అప్పటి రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది. తొలుత కొంతకాలం తమ బంగళాలోనే నిర్వహించబడ్డ భాషా నిలయానికి రావిచెట్టు సహధర్మ చారిణి లక్ష్మీ నరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయముకు అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం.

తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం గల రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు తో కలసి శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, తర్వాత విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించారు. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఈ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువ పైబడి వచ్చే వడ్డీతో ప్రతియేటా కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించ బడింది.

ఈ గ్రంథాలయం సెప్టెంబర్ 1, 1901 సంవత్సరంలో (ప్లవ నామ సంవత్సర శ్రావణ బహుళ తదియ ఆదివారం) హైదరాబాదులోని రామ కోటి ప్రాంతంలో స్థాపించ బడింది. ఇది తెలంగాణా ప్రాంతంలో మొదటి గ్రంథాలయం. దీని స్థాపనతో ప్రారంభమైన నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమం తెలంగాణా ప్రజలలో చైతన్య కలుగజేసి తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవనానికి అపారమైన కృషి జరిపింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్గొంచ, భద్రాచలం సంస్థానాధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షులుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. ఆనాటి సభలో పాల్గొన్న పెద్దలలో మునగాల రాజా నాయని వెంకట రంగారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, డా. ఎం.జి.నాయుడు, ఆదిపూడి సోమనాథరావు, శ్రీ మైలవరపు నరసింహశాస్త్రి, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీరభద్రరావు, కొరారు వెంకట్రావు నాయుడు పేర్కొనదగినవారు.

ఈ సంస్థ ప్రథమ గౌరవ కార్యదర్శి రావిచెట్టు రంగారావు 1910లో స్వర్గస్థులు కాగా, ఆయన స్థానంలో కర్నూలు పార్థసారథి నాయుడు కార్యదర్శిగా గ్రంథాలయానికి స్వంత భవనం నిర్మించాలని సంకల్పించారు. రంగారావు సతీమణి శ్రీమతి రావిచెట్టు లక్ష్మీ నరసమ్మ గారు భాషా నిలయానికి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళం ప్రకటించారు. దానితో ఇప్పుడు సుల్తాన్‌బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం జరిగింది.

1915 సంవత్సరంలో ఆంధ్ర పితామహుడిగా ప్రసిద్ధిచెందిన శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు కార్యదర్శి పదవిని చేపట్టిన తర్వాత పాత ఇల్లు స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి దీక్ష వహించారు. నాయని వెంకట రంగారావు, కర్నూలు పార్థసారథి, నాంపల్లి గౌరీశంకర వర్మ, లాలా జీ మేఘ్ జీల ఆర్థిక సహాయంతో నూతన భవన నిర్మాణం జరిగింది. ఈ భవనానికి ప్రఖ్యాత విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి సెప్టెంబర్ 30, 1921 తేదీన ప్రారంభోత్సవం చేశారు.

భాషా నిలయం జంట నగరాలలో కాక తెలంగాణ ప్రాంతపు తెలుగు వారందరికీ కూడలి స్థలమైంది. ఉత్సవాలు, ప్రసంగాలు, సభలు, సమావేశాలు జరుపుకోవడానికి మంచి అవకాశం కలిగింది. శ్రీ కృష్ణదేవ రాయలు జయంతి ఉత్సవాలు ప్రారంభించి నన్నయ, తిక్కన, పోతన, వేమన మొదలైన మహాకవుల జయంతి ఉత్సవాలను ప్రతియేటా జరుపుతూ ఉండేవారు. ప్రాచీన కవులతో కాక ఆధునిక కవులైన గురజాడ, గిడుగు, కొమర్రాజు వంటి ఆధునిక భాషా సేవకుల జయంతులు, వర్ధంతులు కూడా జరుపుతూవచ్చారు. భాషా నిలయం స్థాపన జరిగి 25 సంవత్సరాలు రజతోత్సవాలను 1927 ఫిబ్రవరి 16, 17, 18 తేదీలలో కావ్యకంఠ గణపతి శాస్త్రి అధ్యక్షతన జరిగాయి. అప్పటి గౌరవ కార్యదర్శి బూర్గుల రామకృష్ణారావు ప్రధాన పాత్ర పోషించి రజతోత్సవ సంచిక ప్రచురించారు. దీని స్వర్ణోత్సవాలు 1952 సెప్టెంబర్ 1వ తేదీనుండి మూడు రోజులపాటు అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షత వైభవంగా జరిగాయి. అప్పటి ఆంధ్ర ప్రభుత్వ ఆస్థానకవి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ప్రారంభోత్సవం చేశారు. భాషా నిలయ వజ్రోత్సవాలు 1962 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అధ్యక్షతన జరిగిన మూడు రోజుల ఉత్సవాలు నిర్వహించి వివిధ వజ్రోత్సవ సంచికను ప్రచురించారు. భాషా నిలయపు అమృతోత్సవం 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నేతృత్వంలో అత్యంత వైభవంగా జరిగాయి. శతాబ్ది ఉత్సవాలు 2002 సెప్టెంబర్ 16వ తేదీన భాషా నిలయం ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగాక 2016 జూన్ 29నుండి తెలుగు భాషా నిలయంగా పేరు మార్చుకుని, సాహితీ ప్రియులకు ఉపకరిస్తున్నది. 2015 అక్టోబర్ 29నుండి నుండి సీనియర్ జర్నలిస్టు ఉడయవర్లు కార్యదర్శిగా, ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి గౌరవ అధ్యక్షులుగా, స్వాతంత్ర సమర యోధులు నూతి శంకర్ రావు కార్యనిర్వాహక అధ్యక్షులుగా, నేటికీ, సాహిత్య సభలు, సమావేశాలు జరిపిస్తున్నారు. 2016లో రావిచెట్టు రంగారావు దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. మూల నిధిని సమకూర్చుకుని, వడ్డీ డబ్బులతో తెలుగు భాషా పరిరక్షకు పాటు పడిన మహనీయుల స్మృత్యర్థం మాసానికి ఒక సారి జయంతి వేడుకలు నిర్వహించి, వారి పేర్ల మీద 9 అవార్డులు, నగదు అందిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# శివారు ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం

- రూ.630 కోట్లతో 50 కి.మీ. మేర ఆదర్శ రహదారులు 3 ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్, జంక్షన్ల అభివృద్ధి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




**కరీంనగర్, ఆగస్టు31(సింగిడి):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి నగరాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని, నగర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ 45వ డివిజన్ మంకమ్మతోటలోని ఎమ్మెల్సీ గోపాల్‌రావు భవనం సమీపంలో రూ. 70 లక్షల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో చేపట్టనున్న డ్రెయిన్ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులకు బండి సంజయ్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం నుంచి ఇప్పటికే రూ. 50 కోట్ల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని, మరో రూ. 30 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పట్టణ సవాల్ నిధుల జాబితాలో కరీంనగర్‌ను చేర్పించి రూ. 840 కోట్ల నిధులు సాధించామని తెలిపారు. ఇందులో రూ. 630 కోట్లతో 50 కిలోమీటర్ల మేర 40 అడుగులు, అంతకంటే ఎక్కువ వెడల్పుతో ఆదర్శ రహదారులను నిర్మించనున్నట్లు చెప్పారు. జిల్లా కోర్టు, ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి, గీతాభవన్ వద్ద మూడు కాలినడక వంతెనలు, కరీంనగర్ బస్‌స్టేషన్ వద్ద ఉప్పల్ తరహాలో స్కైవాక్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. నగరంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి సుందరీకరించడంతో పాటు 130 విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసి కాలుష్యరహిత రవాణాకు ప్రోత్సాహం కల్పిస్తామని తెలిపారు. వర్షపు నీరు నిలిచిపోకుండా నగరంలో 80 కిలోమీటర్ల మేర వర్షపు నీటి కాలువలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ. 80 కోట్లతో ఘన వ్యర్థాల సమగ్ర నిర్వహణ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో చెత్త సేకరణ, వేరు చేయడం, పునర్వినియోగం, శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం వంటి చర్యలు చేపడతామని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ఏడేళ్లలో రూ. 22 వేల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలుగు రాష్ట్రాల్లోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యుటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా ప్రారంభమైన కృత్రిమ మేధ




- సమయాన్ని ఆదా చేసి, పనులను వేగవంతం చేయడంతో పాటు ఖర్చును తగ్గించవచ్చు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

**కరీంనగర్, ఆగస్టు31(సింగిడి):** కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఆద్యా ప్రాంగణంలో కృత్రిమ మేధ (ఏఐ)ను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృత్రిమ మేధతో వివిధ పనులను తక్కువ సమయంలో పూర్తి చేయడంతో పాటు సమయం, ఖర్చును ఆదా చేయవచ్చన్నారు. పనుల్లో తప్పులను తగ్గించడంతో పాటు అవసరమైన సమాచారాన్ని వేగంగా సేకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. కృత్రిమ మేధను ప్రతి ఒక్కరూ సరైన విధానంలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు కృత్రిమ మేధ ఎంతో ఉపయోగకరమని, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఐఐటీ, నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరమని అన్నారు. తెలంగాణలోని విద్యాసంస్థల్లో అల్ఫోర్స్ తొలిసారిగా కృత్రిమ మేధను ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సాఫ్ట్‌వేర్ ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ విద్యార్థుల ధర్నా



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికి పెండింగ్లో ఉన్న 12 వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్లో ఉన్న విద్యార్థుల స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు కనీసానికి విద్యార్థుల యొక్క సమస్యలను పట్టించుకోకుండా అధికారం కోసం తాపత్రయ పడుతున్నారని ఎద్దేవ చేశారు. విద్యార్థులు స్కాలర్షిప్లు రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని చాలామంది నిరుద్యోగులు కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల యొక్క స్కాలర్షిప్లు బకాయిలు చెల్లించాలని లేనట్లయితే సెక్రెటరీ ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరూప్ ఆరిఫ్ రోహిత్ ఆఫ్రిత్ తదితరులు పాల్గొన్నారు.

## నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

### రాజుపేటలో మెగా రక్తదాన శిబిరం విజయవంతం




**ములుగు ప్రతినిధి ఆగస్టు 31 (సింగిడి):** మంగపేట మండలం రాజుపేట రైతు వేదికలో సోమవారం నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. శిబిరంలో ఏటూరునాగారం ప్రభుత్వ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొని రక్తదాతల నుండి రక్తాన్ని సేకరించారు. రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు మంగపేట మండల శ్రేయద ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరం ఏర్పాటుకు తుమ్మల బెనర్జీ, కొమరం డాక్టర్ సుమతి మోహన్, బొప్పన జ్యోతి, యెల్లబోయిన రాకేష్ తదితరులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నేస్తం సేవా ట్రస్ట్ ప్రతినిధి అమిర్ మాట్లాడుతూ... రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ హాజరయ్యి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నేస్తం సేవ ట్రస్ట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రేయద ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గొప్ప సమ్మారావు, ప్రధాన కార్యదర్శి చెంచయ్య, ఏటూరునాగారం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది నిర్మల, మురళి, వైష్ణవ్, అటెండర్ సంపత్, జై భీమ్ రామ్ మోహన్, మంగపేట మండల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు జానపట్ల జయరాజు, గడ్డం ప్రశాంత్, ఉగ్గుమల్ల గణేష్, బోడ ప్రవీన్, స్థానిక యువకులు దితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి సమస్యల వెల్లువ...



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి):** జమ్మికుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కి 13 మంది వివిధ రకాల ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో పద్మావతి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కి మండల పట్టణ పరిధి నుండి 13 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను విచారణ చేసి పరిష్కరిస్తామని మండల పరిధిలో పరిష్కారం సమస్యలను డివిజన్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని అక్కడ కూడా సమస్యకు పరిష్కారం లభించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులలో ఎమ్మార్వో కార్యాలయానికి సంబంధించి ఆరు ఎంఈఓ కార్యాలయానికి సంబంధించిన రెండు మున్సిపాలిటీకి సంబంధించి ఒకటి ఎంపీ ఓ కు సంబంధించింది ఒకటి హౌసింగ్ ఏఈకి సంబంధించిన దరఖాస్తు ఒకటి ఎలక్ట్రిసిటీ సంబంధించింది ఒకటి ఎంపీడీవో సంబంధించింది ఒకటి మొత్తం 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## "రాయబారపు"కు దక్కిన అరుదైన గౌరవం

**బిజెపి ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీగా నియామకం**

**ఎంపీ ఈటెలకు కృతజ్ఞతలు తెలిపిన వేణుగోపాల్**



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి) :** జమ్మికుంట పట్టణానికి చెందిన రాయబారపు వేణుగోపాల్ కు బిజెపి పార్టీలో సముచిత స్థానం దక్కింది. జమ్మికుంట శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేసిన రాయబారపు వేణుగోపాల్ కు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ వేణుగోపాల్ ను మేడ్చల్ మల్కాజిగిరి రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా సింగిడి తో వేణుగోపాల్ మాట్లాడుతూ, చిన్నతనం దేశంపై అభిమానం ఎక్కువ అని దానికి తోడు తాను శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాలయం జమ్మికుంట లో చదువుకోవడం వల్ల ఆర్ఎస్ఎస్ ఏబీవీపీ కార్యకలాపాలపై మరింత మమకారం పెరిగిందని ఆ అభిమానం బిజెపి వైపు తీసుకువెళ్లిందని తెలిపారు. జమ్మికుంట నుండి మొదలైన తన ప్రస్థానం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బోడుప్పల్ లో నివాసముంటున్న తనకు ఈటల రాజేందర్ తో ఏర్పడిన పరిచయం తో మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం జరిగిందని అన్నారు. ఉద్యమ సమయంలో ఈటల రాజేందర్ తో కలిసి పని చేయడం గొప్ప అనుభూతిని కలిగించిందని అప్పటినుండి మొదలైన తన ప్రస్థానం ఈటెల రాజేందర్ తో కొనసాగుతూ ఉందని తనపై నమ్మకంతో మేడ్చల్ మల్కాజిగిరి రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈటెల రాజేంద్ర ఆశీస్సులతో అవకాశం నాకు రావడం సంతోషంగా ఉందని ఆయన సూచన మేరకు పార్టీ బలోపేతం కోసం నిరంతర పాటు పడతానని ఈ సందర్భంగా తెలిపారు. నాకు కల్పించిన ఈ అవకాశం తో బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాబోయే అన్ని రకాల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.

**వేణుకు వెల్లువెత్తుతున్న శుభాకాంక్షలు**

జమ్మికుంట పట్టణంలో విద్యాభ్యాసం చేసిన రాయబారపు వేణుగోపాల్ కు మేడ్చల్ మల్కాజ్గిరి రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల స్థానిక బిజెపి నేతలతో పాటు ఆయన చిన్ననాటి మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వేణు మరిన్ని ఉన్నతమైన పదవులు పొంది ఉన్నత స్థితికి చేరుకోవాలని అతని పదవ తరగతి విద్యార్థుల బృందం ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి):** ఎన్నికలకు ముందు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చిందని వెంటనే హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రోజున సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామాలను, ప్రభుత్వ పాఠశాలలను, ఆసుపత్రులను సందర్శించడం జరిగిందన్నారు. ప్రభుత్వ బడుల్లో అనేక సమస్యలు ఉన్నాయనీ, ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరన్నారు. అనేక ప్రభుత్వ బడుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందనీ, స్వీపర్స్, అటెండర్స్ లేరన్నారు. క్లాస్ రూమ్స్ శిథిలావస్థలో ఉన్నాయనీ. కొన్ని స్కూళ్లలో పెద్ద చెట్లు ఉండడం మూలంగా ఈదురు గాలులకు విరిగిపడితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు బడుల్లో ఇష్టారితిన ఫీజులు వసూలు చేస్తున్నారనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. పేషెంట్లకు కావలసిన మందులు లేవని,సమయానికి డాక్టర్లు, సిబ్బంది రావడం లేదన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడి విపరీతంగా పెరిగిపోయింది అన్నారు. అర్హులైన పేదలకురేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో చేతి బోర్ పంపులు పనిచేయడం లేదని వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్లో ఉన్న సాదా బైనామాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతు చేయాలన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఉచిత విద్యుత్తును 24 గంటల పాటు సరఫరా చేయాలన్నారు. కరెంటు కోతలను నివారించాలన్నారు. ప్రభుత్వ స్కూల్స్ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్ రూమ్ ల ఇండ్లు అరులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి, అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు అందించాలన్నారు. పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి సీటు ప్లస్ 50% ప్రకారం మద్దతు ధరలు నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, మండల కమిటీ సభ్యులు రావుల ఓదెలు, చేరాలు, రమేష్, సాయిరాం, నాగరాజు, సురేష్, హరీష్, సమ్మయ్య, ఖలీల్ పాషా, ఉడుత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**హామీల అమలుకు సమరశంఖం పూరిద్దాం**

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**సెప్టెంబర్ 2 నుండి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు**



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'సమరభేరి' పేరుతో వారం రోజులపాటు విస్తృత నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. సోమవారం హుజూరాబాద్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడారు. 100 రోజుల్లో గ్యారెంటీలను అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. వెయ్యి రోజులైనా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు ఇలా ప్రతి వర్గాన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు.

**'సమరభేరి' నిరసనల షెడ్యూల్..**

సెప్టెంబర్ 2: హుజూరాబాద్లోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ ధర్నా, ప్రభుత్వ బకాయిలపై 'బాకీల కార్డు' పంపిణీ, 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన.
సెప్టెంబర్ 3: వీణవంకలో యూరియా కొరత, రైతుబీమా, నీటిపారుదల, వ్యవసాయ సంక్షోభంపై నిరసన.
సెప్టెంబర్ 4: కమలాపూర్లో మహిళలకు రూ. 2,500 సాయం, తులం బంగారం, స్కూటీల హామీల అమలు కోరుతూ 'వంటా–వార్పు'.
సెప్టెంబర్ 5: జమ్మికుంటలో ఫీజు రీయింబర్స్మెంట్, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ సమస్యలపై యువతతో ఆందోళన.
సెప్టెంబర్ 6: పంచాయతీలు, ఆటో కార్మికులతో కలిసి గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల కోరుతూ హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంటల్లో భారీ ర్యాలీలు.
సెప్టెంబర్ 7: ఐదు మండలాల్లో 'ప్రజావాణి' నిర్వహణ, ప్రజల సమస్యలపై వేలాది వినతిపత్రాల సేకరణ.
సెప్టెంబర్ 8: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైఫల్యాలపై వినతిపత్రం అందజేతతో ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజల పక్షాన చేపడుతున్న ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని, నియోజకవర్గ ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ వీణవంక ఇల్లంతకుంట మాజీ ఎంపీపీలు ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి సరిగోమ్ముల పావని వెంకటేష్ హుజురాబాద్ మాజీ ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి తోపాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు జెడ్పిటిసిలు ఎంపీటీసీలు సర్పంచులు వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సీపీ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ

**పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి**

**సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలి**



**కరీంనగర్, ఆగస్టు 31(సింగిడి):** కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నేర పరిశోధన, నేరస్తుల వివరాల నమోదు వ్యవస్థలో పొందుపరచాలని ఆదేశించారు. పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన వివిధ సాంకేతిక వ్యవస్థలపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకుని, రోజువారీ విధుల్లో సమర్థంగా వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రథమ సమాచార నివేదికల సూచికను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి కారణాలను తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతర పోలీస్ పర్యవేక్షణపై దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్ పరిధిని విభాగాలు, ఉపవిభాగాలుగా విభజించి ప్రాంతాల వారీగా పోలీసు అధికారులను కేటాయించడం ద్వారా ప్రజలకు పోలీసుల సేవలు మరింత చేరువ చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి నెలా తాజా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. తనిఖీలో త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ తిరుమల్‌గౌడ్‌తో పాటు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ల గడువు 15 రోజులు పెంచిన ప్రభుత్వం

**ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**

**మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, ఆగస్టు 31 (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్ల గడువును 15 రోజులు పెంచిందని సెప్టెంబర్ 15 వరకు చేయూత పెన్షన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత పెన్షన్ల గడువు గతంలో ఆగస్టు 31 వరకు ఉండగా సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు తాజాగా సేర్ప్ సీఈవో సోమవారం ఒక సర్కులర్ జారీ చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# ధ్యానం మనలో ప్రేమ, సహానుభూతి, సామరస్యాన్ని పెంపొందిస్తుంది

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ ఆగస్టు 31 (సింగిడి):** ధ్యాన్యం మనసులో ప్రేమ, సామరస్యాన్ని సానుభూతిని పెంపొందిస్తుందని మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం పట్టణంలోనే ఈదులగూడా ధ్యానం కేంద్రంలో ముగింపు సమావేశలకు హాజరై ఆయన మాట్లాడుతూ ధ్యానోత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జీవితంలో జటిలమైన సమస్య ఎదురైనప్పుడు ఒక నిమిషం మన అంతరంగంతో అనుసంధానమై ప్రశాంతంగా ఆలోచిస్తే, ఆ సమస్యకు పరిష్కారం వైపు వెళ్లే మార్గం కనిపిస్తుందని



తన వ్యక్తిగత అనుభవాన్ని ఎమ్మెల్యే పంచుకున్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సానుకూల దృక్పథంతో స్వీకరిస్తే, అవే మన వ్యక్తిత్వ వికాసానికి, జీవితంలో మరింతగా ఎదగడానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి పరిస్థితిలో మనమే నెగ్గాలనే భావనకు బదులుగా, సమస్య లోతును అర్థం చేసుకుని పరిస్థితికి అనుగుణంగా మనల్ని మనం మార్చుకోవడంలో ధ్యానం ఎంతో సహాయపడుతుందని పేర్కొన్నారు. తాను కాన్హా శాంతివనం సందర్శించినప్పుడు అక్కడ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను స్వయంగా వీక్షించి ఎంతో ప్రేరణ పొందానని బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ధ్యానం వ్యక్తిగత ప్రశాంతతతో పాటు సమాజంలో సానుకూలత, ప్రేమ, సహానుభూతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

- సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు



**కరీంనగర్, ఆగస్టు31 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు తెలిపారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, వృద్ధులు, వికలాంగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసన కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

**నిరసన కార్యక్రమాల షెడ్యూల్**

సెప్టెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆరోపణ పత్రం విడుదల.
సెప్టెంబర్ 2: ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యంపై నిరసనలు.
సెప్టెంబర్ 3: వ్యవసాయం, రైతులు, నీటిపారుదల, భూ సమస్యలపై కార్యక్రమాలు.
సెప్టెంబర్ 4: మహిళలు, వృద్ధులు, వికలాంగులు, సంక్షేమ పథకాలపై నిరసనలు.
సెప్టెంబర్ 5: విద్యార్థులు, యువత, ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్ మెంట్‌పై కార్యక్రమాలు.
సెప్టెంబర్ 6: నియోజకవర్గాల వారీగా నిరసనలు, ర్యాలీలు, సదస్సులు.
సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రజల్లో చర్చలు, నిరసనలు.
సెప్టెంబర్ 8: జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం. జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రామకృష్ణారావు కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

## కరాటే రంగంలో క్రాంతికుమార్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవం



**కోదాడ, ఆగస్టు 31 (సింగిడి):** కోదాడకు చెందిన మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్‌కు ఉత్తమ రిఫరీ అవార్డు లభించింది. విజయవాడ గాంధీనగర్‌లోని కొవ్వుట కళావేదికలో నిర్వహించిన 7వ ఏఎస్ఎంఏ యానివర్సరీ రిఫరీ ట్రైనింగ్ క్యాంప్‌లో 9వ డాన్ కరాటే గ్రాండ్‌మాస్టర్ డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కరాటే, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలు, రిఫరీగా చూపుతున్న ప్రతిభను గుర్తించి ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు క్రాంతికుమార్‌ను అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనలకు బీఆర్ఎస్ కార్యాచరణ

**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 31 (సింగిడి):** ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ను నిలదీద్దామని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. కేబీఆర్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర పార్టీ ప్రకటించిన నిరసన కార్యక్రమాలను విజయ వంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న ప్రెస్‌మీట్, 2న నియోజకవర్గ కేంద్రంలో ధర్నా, బకాయి కార్డుల పంపిణీ, ఫ్లెక్సీల ప్రదర్శన, 3న రైతు సదస్సులు, 4న మహిళలు, వికలాంగులతో వంటావార్పు, 5న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ కోసం యువజన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న మండల, జిల్లా ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించడం, 8న




అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్రకార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్‌యాదవ్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, బొజ్జ వెంకటయ్య, మాజీ జడ్పీటీసీలు తండు సైదులుగౌడ్, తుమ్మల లింగస్వామి, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకటరెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, నగర, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం



- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 31 (సింగిడి):** జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశా లలో ఏర్పాటు చేసిననీట్ పీజీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి, కేంద్ర ఇన్‌చార్జితో పరీక్ష నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నీట్ పి జి పరీక్షకు మొత్తం 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 179 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు సిబ్బంది ని ఆదేశించారు. అదనపు సూపరింటిండెంట్ రమేష్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాశీమిరెడ్డి, సిఐ ఆదిరెడ్డి, పరీక్షల ఇంచార్జ్ ప్రొఫెసర్ ఉపేందర్ కలెక్టర్ వెంట ఉన్నారు.

## శ్రావణమాస బోనాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 31 (సింగిడి):** శ్రావణమాస బోనాల మహోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఆదివారం6వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన బోనాల వేడుకల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం స్థానిక ప్రజలు, మహిళలు, భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొని వారిని ఆత్మీయంగా పలకరించారు.. శ్రావణమాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మన ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, మహిళలు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 6న బోనాల పండుగ

**మిర్యాలగూడ ఆగస్టు 31 (సింగిడి):** ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం పరిధిలో హైదరాబాద్ ఆషాడ మాస బోనాల తరహాలో సెప్టెంబర్ 6 బోనాల పండుగ నిర్వహించ తలపెట్టడం జరిగింది భక్తజన కోటి ఉదయం 8 గంటలకు రాజీవ్ చౌక్ నుంచి ముత్యాలమ్మ వీధి వం-కు అమ్మవారి ఆలయం వరకు ర్యాలీగా రావడం అందులో ముఖ్యంగా మిర్యాలగూడ ప్రథమ పౌరురాలు శసుధా బాలకృష్ణ మున్సిపల్ చైర్ పర్సన్ బంగారు బోనం ఎత్తుకోనున్నారు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. అట్టి కార్యక్రమంలో వివిధ పూజ సామాగ్రులతో రాజకీయ నాయకులు పలువురు హాజరుకానున్నారు అట్టి కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు కావున భక్త మహాశయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని హైదరాబాద్ బోనాల పండుగ ఎలా జరుగుతుందో



దానికి మించి ఇక్కడ నిర్వహించాలని కోరడమైనది ఈరోజు మూడవ ఆదివారం శ్రావణమాసం భక్తజన కోటి పోటెత్తారు ఆలయం మొత్తము చుట్టుపక్క ప్రాంతం మొత్తము భక్త జనులతో సందోహంగా ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటెత్తారు ఇట్టి కార్యక్రమానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోల సైదులు ముదిరాజ్ కార్యనిర్వాహక అధ్యక్షులు బంటు సైదులు ముదిరాజ్ బిజెపి కోశాధికారి కోల శ్రీనివాస ముదిరాజ్ ఉపాధ్యక్షులు బంటు గిరి ముదిరాజ్ ఆధారపు మురళి ముదిరాజు బంటు రమేష్ ముదిరాజ్ లింగంపల్లి మట్టయ్య ముదిరాజ్ పబ్లిసిటీ సెక్రటరీ కొంక వెంకన్న ముదిరాజ్ గౌరవ సలహాదారులు బంటు శ్రీనివాస్ ముదిరాజ్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ వార్డ్ కౌన్సిలర్ బంటు శ్రీనివాస్ ముదిరాజ్ వార్డ్ కౌన్సిలర్ సహాయ కార్యదర్శి కొంక శ్రీనివాస ముదిరాజ్ కోల రాంబాబు ముదిరాజ్ నక్క శేఖర్ ముదిరాజ్ కోలా నాగేందర్ ముదిరాజ్ ఆధారపు ఈ దయ ముదిరాజు కోలా రవి ముదిరాజ్ నక్క బిచ్చం ముదిరాజు అవతార పద్మ ముదిరాజు దుండిగల్ విజయ ముదిరాజు దుండిగల్ భవాని ముదిరాజు బంటు సైదులు ముదిరాజు లింగంపల్లి శ్రీను ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

యామన్‌పల్లిలో పోలీసుల అవగాహన




**మహాముత్తారం, ఆగస్టు 31 (సింగిడి):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహాముత్తారం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ దాట్ల కుమారస్వామి సూచించారు. యమనపల్లిలో సైబర్ క్రైమ్, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఇతరులకు చెప్పడం వల్ల ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు మానవాళికి ప్రేరణ

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు

**మహదేవపూర్ ఆగస్టు 31 (సింగిడి):** మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు మానవాళికి ప్రేరణ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. మండలకేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇలా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీ




కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ప్రేమ, సోదరభావం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, ఐక్యత, ఆరోగ్యం, అభివృద్ధి నింపాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనాబాను, ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి మదిన మజీద్ అధ్యక్షుడు ముజాహిద్ ఖాన్ ముస్లిం మత పెద్దలు సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అనిత విద్యా బోధకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రాష్ట్ర అధ్యక్షులు కొత్తపెల్లి సమిరెడ్డి

**మిర్యాలగూడ ఆగస్టు 31 (సింగిడి):** అనియత విద్యా బోధకుల, సూపర్ వైజర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి సమిరెడ్డి, కోరారు. ఆదివారం జరిగిన బోధకుల, సూపర్ వైజర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎండి. మహమూద్ మాట్లాడుతూ బోధకులకు తీపి కబురు త్వరలో వస్తుందని ఆశిస్తున్నామన్నారు. సూపర్వైజర్లు ఉన్నవారికి అవే పోస్టులు, ఏది లేని వారికి పింఛన్లు, పెండింగ్ బకాయిలు మంజూరు ఏజ్ బార్ అయిన వాళ్ళకి బోధకుల వారసులకు ఉద్యోగం ఇవ్వాలని ఉద్యోగం ఇవ్వాలని ఉద్యోగం ఇవ్వాలని క్యాట్కోర్టు కోర్టు లేరు తెలిపినారు త్వరలో రావాలని బోధకులు ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా బోధకుల సూపర్ వైజర్ల సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న గౌడ్, జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్, ఖమ్మం జిల్లా ఇన్చార్జి కోటయ్య, పర్వతాలు, జానయ్య పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పట్ల సీఎం నిర్ణయం హర్షణీయం

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

**మిర్యాలగూడ, ఆగస్టు 31 (సింగిడి):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన ఉద్యమకారుల కుటుంబ సభ్యులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యమంలో పాల్గొనీ కీలకంగా వ్యవహరించి రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేసిన ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడం పట్ల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హర్ష వ్యక్తం చేస్తుంది. ఆదివారం స్థానిక అమరవీర స్తూపం వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు మాలోతు దశరథ నాయక్, బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే సారథ్యంలోనీ కమిటీ సభ్యులు నివేదికను సీఎంకు అందజేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఉద్యమకారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని, ఆలస్యం చేయరాదని ఆదేశించడం ఉద్యమకారుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.. ఎటువంటి జాప్యం చేయకుండా వెంటనే ఉద్యమకారులను గుర్తించి



న్యాయం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని త్వరలోనే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్సైట్ ఏర్పాటు చేయబోతుందని అందులో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు తగిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం గుర్తించి ఉద్యమకారులకు న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రధానంగా ఉద్యమంలో ప్రాణాలు పోగొట్టుకున్న కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, అంగవైకల్యం చెందిన జైలు జీవితం గడిపిన వారి కుటుంబాలకు ఉద్యోగంతో పాటు 250 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, ఉద్యోగ, ఉపాధ్యాయు లకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు హెల్త్ కార్డులు, పెన్షన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు యర్రబెల్లి దుర్గయ్య, ఆర్టీసీ ఇక్బాల్, క్రాంతి కుమార్, ఎండి. మహమూద్ కొత్తగూడెం, కుంచం రాజ్ కుమార్, గురునాథం, మక్లా నాయక్, సైదా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక



**కాటారం, ఆగస్టు 31 (సింగిడి):** కాటారం మండలంలోని విలాసాగర్, మద్దులపెల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి తెలిపారు. విలాసాగర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పూసల శశికాంత్, ఉపాధ్యక్షులుగా మురుకుంట్ల స్వామి, వీరబోయిన రాజసాగర్, మద్దులపెల్లి గ్రామ కాంగ్రెస్ గౌరవ అధ్యక్షుడిగా డోలి రామకృష్ణ, అధ్యక్షుడిగా మల్లారం మహేష్, ఉపాధ్యక్షులుగా టంగుటూరి శ్రావణ్, డోలి సతీష్ లను నియమించారు. అలాగే కొత్తపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజ్మీరా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా తుమ్మ అజయ్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం అభిషేక్‌ను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి పంతకని సమ్మయ్య మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయడంతోపాటు, గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కమిటీ సభ్యులు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి అంగజాల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశీవర్ధన్ రావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, యూత్ కాంగ్రెస్ కాటారం మండల అధ్యక్షుడు చిటూరి మహేష్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్ రెడ్డి, గడవేన దేవేందర్, బండం రాంరెడ్డి, పాగే సురేష్, అజ్మీర రఘురాం, బీసుల నర్సయ్య, తెప్పల ప్రభాకర్ రెడ్డి, అందె సత్తయ్య, గోనె మహేష్, కోడి రవికుమార్, మదారి రాజు, మేడిపల్లి కిరణ్, సుందిళ్ల ప్రభు, కొట్టే శ్రీహరి, సంతోషం దేవేందర్, మంత్రి ప్రభాకర్, తిప్పిరి సారయ్య, వీరబోయిన రాజసాగర్, పప్పుల రాజయ్య, తోడే మాధవరెడ్డి, కందుల కోటేశ్వరరావు, చిట్యాల చంద్రయ్య, బుర్ర చలం గౌడ్, జాడి వినోద్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



**కాటారం, ఆగస్టు 31 (సింగిడి):** మండలంలోని జాదురావ్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆచార్యులు సమ్మయ్య చారి, లక్ష్మీరాజు ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ముగ్గు పోసి గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట అశోక్, బొద్దుల సతీష్, బద్ది వెంకటేష్, పొరండ్ల రమేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 45వ సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేసిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్
- క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి: కాట సుధ

**రామచంద్రపురం, ఆగస్టు 31 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం పరిధిలోని ఎంఐజీ కాలనీలోని శ్రీ వాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో స్వర్గీయ కాటూరి శంకరరావు జ్ఞాపకార్థం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 45వ సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. గత మూడు రోజులుగా (ఈ నెల 28 నుంచి 30 వరకు)



కొనసాగిన ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.. ముగింపు వేడుకలకు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడుతాయని సూచించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, పలువురు నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# బ్రేక్ ఫాస్ట్‌లోకి అదిరిపోయే 'మసాలా చపాతీ రోల్'!

ఇది కేవలం రుచికరమైనది మాత్రమే కాదు, మన ఇంట్లో నిత్యం అందుబాటులో ఉండే కూరగాయలతో చేసేది కాబట్టి చాలా ఆరోగ్యకరమైనది కూడా. హోటల్ తరహా రుచిని ఇంట్లోనే పది నిమిషాల్లో తీసుకురావచ్చు. అటు అల్పాహారంగా, ఇటు సాయంత్రం స్నాక్ లాగా లేదా ఆఫీస్ లంచ్ బాక్స్ లోకి కూడా ఇది ఒక పర్ఫెక్ట్ ఛాయిస్. మరి ఈ క్రీమీ అండ్ స్పైసీ రోల్ ఎలా తయారు చేయాలో ఇప్పుడు వివరంగా చూద్దాం.



**కావలసిన పదార్థాలు:**
మెత్తటి చపాతీలు -2 లేదా 3
ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగినవి)
క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ - తగినంత (సన్నని ముక్కలు)
ఉడికించిన బంగాళదుంప లేదా పనీర్ ముక్కలు - 1 కప్పు
అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్
పసుపు -- చిటికెడు
కారం - 1 టీస్పూన్
గరం మసాలా, చాట్ మసాలా -- తగినంత
ఉప్పు - రుచికి సరిపడా
నూనె - 2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర - అర టీస్పూన్
టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీ -- పూయడానికి
కొత్తిమీర - కొద్దిగా

**తయారీ విధానం:**
మొదటగా ఒక బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు తరిగి పెట్టుకున్న క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ ముక్కలను వేసి కొద్దిసేపు మగ్గనివ్వాలి. కూరగాయలు మరీ మెత్తగా అవ్వకుండా కొంచెం క్రంచీగా ఉంటేనే రోల్ రుచిగా ఉంటుంది.

కూరగాయలు వేగిన తర్వాత పసుపు, కారం, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. చివరగా ఉడికించిన బంగాళదుంప ముక్కలు లేదా పనీర్ ముక్కలు వేసి మసాలా అంతా పట్టేలా కలిపి కొత్తిమీర చల్లుకోవాలి. ఇప్పుడు సిద్ధంగా ఉన్న చపాతీని తీసుకుని దానిపై టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీని సమానంగా పూయాలి. మధ్యలో మనం తయారు చేసుకున్న మసాలా మిశ్రమాన్ని ఉంచి చపాతీని రోల్‌లా చుట్టాలి.

**రుచి పెంచే చిన్న చిట్కాలు:**
మీరు దీనిని మరింత స్పెషల్ గా చేయాలనుకుంటే లోపల కొద్దిగా చీజ్ తురుము వేయవచ్చు, ఇది పిల్లలకు చాలా ఇష్టం. అలాగే పనీర్ లేదా చికెన్ ముక్కలను జోడించడం వల్ల ప్రోటీన్ కూడా లభిస్తుంది. సర్వ్ చేసేటప్పుడు రోల్‌ను టిష్యూ పేపర్ లేదా అల్యూమినియం ఫాయిల్‌లో చుడితే తినడానికి సౌకర్యంగా ఉంటుంది.








## ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అండతో ఉదయం లాభాల్లో రాణించిన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో ఆ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో సెన్సెక్స్ 64 పాయింట్లు లాభంతో ముగియగా.. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు మేర క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 73,988.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,918.76) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,613.01 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఆరంభ లాభాలను కోల్పోయి 73,983.18కి పరిమితమైంది. నిఫ్టీ 23,214.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు బ్యారెల్ ధర 91.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4167 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.








## తగ్గిన బంగారం వెండి ధరలు

**ముంబయి:** దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ. 4300 క్షీణించి రూ. 1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ. 10వేలు తగ్గి రూ. 2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**గోల్డ్‌బాండ్లపై జాక్‌పాట్..**
**గ్రాముకు 11,500 లాభం**

అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికితోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇఎడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.

## మిడ్‌రేంజ్ యూజర్ల కోసం రియల్‌మీ నుంచి కొత్త ఫోన్




ఒప్పో అనుబంధ సంస్థ రియల్‌మీ పీ4 సిరీస్‌లో మరో ఫోన్‌ను తీసుకొచ్చింది. పీ4ఆర్ 5జీ (Realme P4R 5G) పేరిట దీన్ని విడుదల చేసింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ, 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో ఈ ఫోన్ వస్తోంది. రియల్‌మీ పీ4ఆర్ 5జీలో 6.8 అంగుళాల హెచ్‌డీ౦ 144 Hz ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 1200 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. డైమెన్‌సిటీ 6300 ప్రాసెసర్ ఇచ్చారు. వెనుకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ ఇచ్చారు. ముందు వైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన రియల్‌మీ యూఐ 7తో పనిచేస్తుంది. 2 ఏళ్లు ఓఎస్ అప్‌డేట్స్, 3 ఏళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఐపీ 65 రేటింగ్, ఏఐ పల్స్ లైట్, మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 8000 ఎంఏహెచ్ బ్యాటరీతో మూడు రోజుల పాటు ఫోన్ వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో పాటు 27W రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది.

**ఇక ధర విషయానికొస్తే..**
ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ. 18,999గా నిర్ణయించారు. 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ. 20,999, 6జీబీ౦ 256జీబీ వేరియంట్ ధర రూ. 22,999గా కంపెనీ పేర్కొంది. కార్డు ఆఫర్‌తో రూ. 2 వేలు డిస్కౌంట్ లభిస్తుంది. జూన్ 17 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సిల్వర్ గ్లేర్, టైటానియం గ్లేర్, లావెండర్ గ్లేర్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా స్టోర్‌లో కొనుగోలు చేయొచ్చు.

## ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్ ఇకపై ఫాస్ట్‌లేన్

ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ ప్లాన్‌ను ఫాస్ట్‌లేన్‌గా రీబ్రాండ్ చేసింది (వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో ఈ మేరకు మార్పులు తీసుకొచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ పేరు మాత్రమే మారిందని, సేవల్లో ఎలాంటి మార్పులూ ఉండబోవని కంపెనీ స్పష్టంచేసింది. ఇందుకు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల 5జీ స్లైసింగ్‌లో భాగంగా ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్‌ను ఎయిర్‌టెల్ తీసుకురాగా.. అది కాస్తా చర్చనీయాంశమైంది. నెట్ న్యూట్రాలిటీకి వ్యతిరేకమన్న వాదనలు వినిపించాయి. ఈ క్రమంలో పేరు మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది.
"పోస్ట్‌పెయిడ్ లాంచ్ క్యాంపెయిన్ ముగిసింది. బ్రాండ్ పేరు మాత్రమే మారింది. 5జీ స్లైసింగ్ ప్లాన్‌లో, ప్రయోజనాల్లో ఎలాంటి మార్పులూ ఉండవు. పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల కోసం తీసుకొచ్చిన ఫాస్ట్‌లేన్ విధానం వల్ల ప్రీపెయిడ్ యూజర్లపై ఎలాంటి ప్రభావం ఉండబోదు" అని ఎయిర్‌టెల్ ప్రతినిధి తెలిపారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
1-9-2026

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌కు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

**ఖర్గే అవమానంపై ప్రశ్నిస్తే రాహుల్‌పై కేసా?: కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్**



**కరీంనగర్, (సింగిడి):** రాహుల్ గాంధీపై ఉత్తరా ఖండ్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌కు నిరసనగా కరీంనగర్ డీసీసీ కార్యాలయం ఎదుట సోమవారం కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న కుల ఆధారిత వివక్షను ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాజ్యాంగ విలువలను అవమానించిన వారిపై చర్యలు తీసుకో కుండా, వారిని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం సరికాదని విమర్శించారు. కుల వివక్ష, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహ రించుకోవడంతో పాటు, అసలు ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్ హుస్సేన్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్‌కుమార్, పర్వత మల్లేశం, కాంతల జగన్‌రెడ్డి, వరాల నర్సింగం, ఆకుల ఉదయ్, ముసుకు ఉపేందర్‌రెడ్డి, విక్రమ్, కొమ్మెర రవీందర్‌రెడ్డి, దిండిగాల మధు, ఖలీముద్దీన్, మూల కృష్ణారెడ్డి, గుర్రం వాసు, అబ్దుల్ రహమాన్, వంగల విద్యాసాగర్, మేకల నరసయ్య, సత్తినేని శ్రీకాంత్, సిరిపురం లావణ్య నాగప్రసాద్, బషీరుద్దీన్, గడప అజయ్, గడప శ్రీనివాస్, మాలోతు మహాలక్ష్మి, ఇమ్రాన్ ఘని తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన రహదారికి

## మరమ్మతులు చేపట్టాలి

**ప్రజావాణిలో ఎంపీడీవోకు గ్రామస్థుల వినతి.**



**నల్లబెల్లి, (సింగిడి):** నల్లబెల్లి,మండలంలో మేడపల్లి--రాంపూర్--ఆశ్రవెల్లి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రహదారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మేడపల్లి, రాంపూర్, ఆశ్రవెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, రైతులు, వాహనదా రులు ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారినపడే పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. రహదారి దెబ్బతినడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ మార్గంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా నూతన రహదారి నిర్మాణ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రహదారి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## పదవీ విరమణ ఉద్యోగానికే తప్ప... వ్యక్తికి కాదు..!

**గిరిజన ఆశ్రమల పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్ రాజు ఘనంగా పదవి విరమణ**



**హుస్నాబాద్,(సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, వారి లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఉపాధ్యా యుడు అశోక్ రాజ్ అని సహ ఉపాధ్యా యుడు బిక్షపతి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా అశోక రాజు మాట్లాడుతూ సహచర ఉపాధ్యాయు డు బిక్షపతి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చేసిన సేవలను ఆయన గుర్తు చేసుకు న్నారు. సోమవారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమం ఆత్మీయత, భావో ద్వేగాల మధ్య ఘనంగా జరిగింది. "విరమణ పదవికి తప్ప... వ్యక్తికి కాదు" అంటూ పలువురు విద్యార్థులు అశోక్ రాజ్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, మానవీయ విలువలు, ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులను నడిపించిన ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో పాఠశా ల ప్రధానోపాధ్యా యులు శ్రీనాథ్,మంద శ్రీనివాస్, భూక్య శ్రీనివాస్,కొత్తపల్లి మహేందర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొని అశోక్ రాజ్‌ను ఘనంగా సన్మానించి, ఆయన భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

హంగులు.. ఆర్భాటాలకు దూరంగా..

# ప్రజల మధ్యే ప్రయాణం

**పేద ప్రజలకు ఆప్తుడు.. నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం: కేడం లింగమూర్తి**

**రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు కాదు.. ప్రజా సమస్యలపై చర్చే ముఖ్యం**

**హుస్నాబాద్ (సింగిడి):** రాజకీయాలు అంటే ఒకప్పుడు ప్రజల మధ్య ఉండటం.. వారి కష్టాల్లో తోడుగా నిలవడం.. సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారం కోసం ప్రయత్నించడం. కానీ మారుతున్న కాలంలో రాజకీయాల తీరు కూడా మారిపోయింది. హంగులు.. ఆర్భాటాలు.. పెద్ద పెద్ద వాహనాలు.. సోషల్ మీడియా ప్రచారాలు.. అనుచరుల హడావుడి.. ఇలా రాజకీయాలకు కొత్త నిర్వచనాలు కనిపిస్తున్నాయి. అయితే వీటన్నింటికీ భిన్నంగా ప్రజల మధ్య సాధారణ వ్యక్తిగా ఉంటూ, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందించే వ్యక్తిగా హుస్నాబాద్ మాజీ సర్పంచ్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**పదవి కోసం కాదు.. ప్రజల కోసం**

పదవి అనేది ప్రజలకు సేవ చేయడానికి ఒక అవకాశం మాత్రమేనని నమ్మే వ్యక్తి కేడం లింగమూర్తి. సర్పంచ్‌గా ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధితో పాటు సామాజిక అంశాలపై కూడా తనదైన ముద్ర వేసిన వ్యక్తిగా ఆయనను స్థానికులు గుర్తు చేసుకుంటారు. పేదవాడు తన సమస్య చెప్పుకోవడానికి సంకోచించకూడదని.. ప్రజాప్రతినిధి చుట్టూ ఎలాంటి అడ్డంకులు ఉండకూడదనే భావనతో ప్రజలతో మమేకమై ఉండటం ఆయన శైలిగా చెబుతారు.

**రాజకీయ ప్రత్యర్థి కావచ్చు.. వ్యక్తిగత శత్రువు కాదు**

రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు సహజం. కానీ రాజకీయాలను వ్యక్తిగత విమర్శలకు వేదికగా మార్చకూడదనేది లింగమూర్తి అభిప్రాయం. వ్యతిరేకించే విధానాన్ని విమర్శించాలి కానీ వ్యక్తిని కించపరిచే విధంగా మాట్లాడకూడదని ఆయన భావిస్తారు. ఏ విషయం అయినా పూర్తిగా తెలుసుకుని.. విశ్లేషించి.. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలే తప్ప, వినీ విననట్టుగా మాట్లాడటం తనకు నచ్చదని చెబుతారు. అందుకే ఆయన రాజకీయ ప్రయాణంలో వ్యక్తిగత దూషణల కంటే ప్రజా సమస్యలే ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి.



**అంబేద్కర్ ఆశయాలపై విశ్వాసం**

సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించాలంటే విద్య ఎంతో అవసరమని నమ్మే లింగమూర్తి.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని చెబుతుంటారు. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని.. యువత సరైన మార్గంలో నడిస్తే సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఆయన విశ్వసిస్తారు.

**యువతే భవిష్యత్.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో మత్తు పదార్థాల వినియోగం కూడా ఒకటి. యువత మత్తుకు బానిస కాకుండా క్రీడలు, విద్య, సామాజిక సేవ వైపు అడుగులు వేయాలని లింగమూర్తి పిలుపునిస్తుంటారు. క్రీడా మైదానాలు యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిస్తాయని.. సమాజ సేవ యువతలో బాధ్యతను పెంచుతుందని ఆయన అభిప్రాయం.

**గ్రంథాలయానికి బాధ్యత.. సమాజానికి దిశ**

సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో కూడా పుస్తక పఠనం, విజ్ఞానం, విద్య ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడం అవసరమని ఆయన భావించారు. పుస్తకం చదివిన యువత ప్రశ్నించడం నేర్చుకుంటుంది.. ప్రశ్నించే యువత సమాజాన్ని మార్చగలుగుతుంది అనే ఆలోచనతో విద్య, పఠనం, విజ్ఞానం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతారు.

**నిరాడంబరతే ఆయన ప్రత్యేకత**

రాజకీయాల్లో ఉన్నా సాధారణ జీవితానికి దగ్గరగా ఉండటం ఆయనలో కనిపించే మరో ప్రత్యేకత. ప్రజలకు దూరంగా ఉండే నాయకత్వం కంటే.. ప్రజల మధ్య నడిచే నాయకత్వమే ఎక్కువకాలం నిలుస్తుందని ఆయన నమ్మకం. పేద ప్రజల కష్టాలను అర్థం చేసుకోవడం.. అవసరమైనప్పుడు వారికి అండగా నిలవడం.. సమాజంలో మంచి జరగాలని కోరుకోవడం.. ఇవే తన రాజకీయ ప్రయాణానికి ప్రాతిపదికగా ఆయన భావిస్తారు.

**ఇప్పటి రాజకీయాలకు..**
**అప్పటి రాజకీయాలకు తేడా ఇదేనా?**

ఒకప్పుడు రాజకీయాలు అంటే ప్రజల కోసం ఆలోచిం చడం.. ప్రజల సమస్యల కోసం పోరాడటం.. ప్రజల మధ్య ఉండటం. ఇప్పుడు మాత్రం ప్రచారం ముందుగా.. సమస్య తర్వాత అనే పరిస్థితి కనిపిస్తోందన్న అభిప్రాయాలు వినిపిస్తు న్నాయి. అలాంటి సమయంలో హంగులు, ఆర్భాటాలకు దూరంగా.. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా.. రాజకీయ ప్రత్యర్థి త్వాన్ని వ్యక్తిగత శత్రుత్వంగా మార్చకుండా.. సమాజం కోసం తన వంతు పాత్ర పోషిస్తున్న వ్యక్తిగా కేడం లింగమూర్తి నిలుస్తున్నారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజలతో ఉండాలి.. రాజకీయాల్లో ఉన్నా వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు.. విమర్శ ఉన్నా విలువలు కోల్పోకూడదు.. అదే నిజమైన ప్రజా రాజకీయమని నమ్మే వ్యక్తి – కేడం లింగమూర్తి. ఇలాంటి నాయకత్వం రాజకీయాల్లో ఎంత అవసరమో.. కాలమే చెబుతుంది.

## ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం

**వెల్గటూర్,(సింగిడి)::** ఉపాధ్యాయ వృత్తిలో గత 37 సంవత్సరాలుగా సేవలు అందించిన వెల్గటూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిప్ప నందయ్య సోమవారం రోజున ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా చిప్ప నందయ్య-జగదీశ్వరి దంపతులకు పాఠశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యా రంగానికి నందయ్య చేసిన సేవల్ని పలువురు వక్తలు కొనియాడారు. వారి భావి జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాడి వెంకటప్రసాద్, ఎంఈఓ ప్రభాకర్, వైద్యాధికారిని డాక్టర్ తేజశ్రీ, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కొండల్ రెడ్డి, ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గంద్ర ప్రతాపరావు, కార్యదర్శి శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లా..

## పుష్కలంగా పంటలు పండిస్తాను వర్షాలు కురిపిస్తాను

**మహంకాళి అమ్మవారు హామీ**





**వెల్దుర్తి, (సింగిడి):** మాసాయిపేట మండలం కేంద్రంలోన మాసాయిపేట పట్టణంలోని సోమవారం మహంకాళి ఉజ్జివ బోనాల పండుగ జాతరకు ఘనంగా బంధువులు అధి సంఖ్యలో పాల్గొన్నారు. జాతరలో ప్రత్యేకంగా గావు ప్రజల్ని ఆకర్షించింది అమ్మవారు ఇలా మాట్లాడుతూ చెరువులు నిండుగా నింపుతాను మంచిగా పంటలు పుష్కలంగా పండిస్తాను అందరికీ ఎలాంటి ఇబ్బం దులు లేకుండా చూసుకుంటాను కానీ గ్రామంలో బొడ్డు రాయి మర్చిపోయినారు అని అన్నారు అనంతరం గ్రామ పెద్దలు బొడ్డు రాయిని పనులు చేస్తామని ఘనంగా జరుపుతామని అమ్మవారికి హామీ ఇచ్చారు వెంటనే అమ్మవారు శాంతించే అలాగే మీ కార్యక్రమాలను ఎలాంటి సంఘటనలు రాకుండా నేను ఎల్లప్పుడూ గ్రామంలో అందరికీ ఆశీర్వాదాలు ఇస్తాను మీరు నాకు పండగ చేయాలని అమ్మవారు కోరింది. గ్రామ ప్రజలు ప్రజా ప్రతిని ధులు అం దరూ సమైక్యత తో పాల్గొని మాజీ ప్రజా ప్రతినిధులు పనివారు నూతన పంచాయతీ పాలకవర్గంతో సమై క్యమై గ్రామ అభివృద్ధి కోసం అందరూ ఐక్యముతో యువత ముందుకు వచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటియ కుండా బోనాల జాతరకు మాసాయి పేట గ్రామం ఇలా ఉంటామని నిదర్శనం తీసుకోవాలని అన్నారు అదేవిధంగా మాసాయి పేట గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ బోనాల పండగ అందరం కలిసి జరుపుకున్న సం దర్భంగా గ్రామ ప్రజలకు, గ్రామ పని వారికి, యువ తకు, యువజన సంఘాలకు, అందరి అండలతో బోనాల జాతరకు నాకు సపోర్ట్ గా ఉన్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు అదేవిధంగా రేపు కట్టమైసమ్మ జాతరకు అందరూ రోడ్డు దాటుతూ గ్రామ మహిళలు, వారి బంధువులు క్షేమంగా కట్టమైసమ్మ జాతరలో పాల్గొనాలని సర్పం చ్ వీరన్న కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు అనంతరం పిఎసి ఎస్ డైరెక్టర్ ఉదండపురం నర్సింలు మాట్లాడుతూ గ్రామ ప్రజలు, గ్రామ పనివారు, అందరం కలిసి బోనాల జాతరను విజయవంతం చేసినందుకు ధన్య వాదాలు తెలిపారు అనంతరం మాజీ చిన్న చౌదరి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్ధిరాములు గౌడ్, మాజీ సర్పంచ్ చిటిమిల నాగరాజ్, మాజీ సర్పంచ్, శోభ సత్యనారాయణ, అందరూ కలిసి మాట్లాడుతూ రెండు రోజులు సమన్వయంతో బోనాల జాతర జరుపుకున్నాం మూడవరోజు కూడా అందరు సమైక్యతో సమన్వయంతో కట్టమైసమ్మకు జాతర వెళ్లాలని కోరారు రాబోయే సంవత్సరంలో ముందుగా అందరితో బోనాల జాతర జరుపుకోవా లని కోరారు . కార్యక్రమంలో నూతన పంచాయితీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు

## కోహెడలో అక్రమ మద్యం విక్రయాలపై అడ్డుకట్ట వేయాలి


**ఇండ్ల మధ్యలోని వైన్‌షాపులను ఊరికి దూరంగా తరలించాలని వినతి**

**కోహెడ, (సింగిడి):** కోహెడ మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులను తక్షణమే అరికట్టాలని కోరుతూ స్థానిక యువకులు మంద వంశీకృష్ణ, వేల్పుల మహేష్-బాబు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ కాలనీ ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోనే బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. దీంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, కాలనీ వాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా జనావాసాల మధ్య, ఇళ్లకు సమీపంలో ఉన్న వైన్‌షాపుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత, మహిళలు, చిన్నారుల రక్షణను దృష్టిలో ఉంచుకుని వైన్‌షాపులను జనావాసాలకు, గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎక్సైజ్, పోలీస్ శాఖలు సమన్వయంతో అక్రమ బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం విక్రయ కేంద్రాలపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## వెంకటయ్య కుటుంబానికి అండగా ఉంటాం

**బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన**

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు**



**తొగుట (సింగిడి):** మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన వడ్ల వెంకటయ్య కుటుంబాన్ని తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వెంకటయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెంకటయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పంది రాజు బాధిత కుటుంబానికి రూ. 3,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వెంకటయ్య కుటుంబానికి గతంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇటీవలే ఇల్లు పూర్తయిందని తెలిపారు. అయితే ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆ ఇంట్లో వెంకటయ్య ఒక్క రోజు కూడా నివసించలేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఉన్న వెంకటయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పంది రాజు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, నాయకులు వడ్డే కిష్టయ్య, వోలపు సత్యనారాయణ, మిద్దె స్వామి, జంగపల్లి ఆంజనేయులు, కల్లేపు భాను చందర్ పోతరాజు రవీందర్, వడ్డే నర్సింలు, సింగోజీ మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అన్వర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**తొగుట (సింగిడి):** పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తల కుటుంబా లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. తొగుట మండలం ఎల్లారెడ్డి పేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త మహ్మద్ అన్వర్ హుస్సేన్ ఇటీవల ప్రమాదవ శాత్తు చెరువులో పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎల్లారెడ్డి పేటలోని అన్వర్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్వర్ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలం అని పేర్కొన్న ఎమ్మెల్యే, అన్వర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొగుట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు నందారం వెంకటేష్ గౌడ్, నాయకులు బోధనం కనకయ్య, బండారు స్వామి గౌడ్, కర్ణాకట్ రెడ్డి, జహంగీర్, నీరజ్, అహ్మద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు..

**లింగాపూర్‌లో**
**నూతన గృహప్రవేశ కార్యక్రమంలో**

మండలంలోని లింగాపూర్ లో బి ఆర్ ఎస్ సీని యర్ నాయకులు తగరం అశోక్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమం లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## పదవి విరమణ సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం వేడుకలు

**పదవి విరమణకు హాజరైన చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్**





**వెల్దుర్తి, (సింగిడి)::** మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ పరిధిలోన చేగుంట మండలంలోని చేగుంట ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై శాలువాతో సన్మానించిన మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ,ఉపాధ్యక్షుడు చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు జీవితంలో కొన్ని సంవత్సరాలు ప్రజల సేవలు అందించి మంచి పేరు తెచ్చుకొని ఎంతో కష్టపడి పదవిలో అందరితో ఆప్యాయతలు పెంచుకొని కష్టసుఖాలు చూసి ఓపికతో ఉద్యోగం చేస్తూ జీవితం గడిపాడు అనంతరం ఆ సేవలు అందించారు అందుకే ఈ యొక్క కార్యక్రమంలో వీడ్కోలు పలుకుతున్నామని ఇప్పటి నుండి కుటుంబంతో జీవితంలో ముందుకు నడవాలని మనసారా భగవంతుని కోరుతున్నాడు అని చేగుంట మండలం మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడారు ఎంపిడిఓ చిన్నారెడ్డి,శంభుని రవి, నందం,మేకల పరమేష్, రఘురాములు,బింగి గణేష్, నవీన్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నాగసముద్రాల మోడల్ స్కూల్‌లో ఏకరూప దుస్తుల పంపిణీ



**కోహెడ, (సింగిడి):** కొహెడ మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పెరుక సరిత ఆధ్వర్యంలో, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు విద్యలో రాణించి జిల్లా స్థాయిలో పాఠశాల ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**లక్ష్మణ్ చందా :(సింగిడి):** లక్ష్మణ చందా: మండలంలోని వదల గ్రామానికి చెందిన నల్ల వినయ్ రెడ్డి బాధితులకు సహాయం అందిస్తూ ఉదారతను చాటుకుంటున్నారు. ఇటీవల మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన సుమన్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు తనవంతుగా రూ 10,000 ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో నల్ల వినయ్ రెడ్డి తోపాటు లక్ష్మణ్ ప్రణయ్ భీమేష్ రమణ శ్రీను సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటేషన్ గడువు ముగిసినా మున్సిపల్ కమిషనర్ కొనసాగింపుపై స్పష్టత ఏది?

నెల రోజులుగా హోల్డ్‌లో డిజిటల్ కీ.. ప్రజలకు నిలిచిన మున్సిపల్ సేవలు
డెత్, బర్త్ సర్టిఫికెట్లు, ఇంటి నంబర్లు, మ్యుటేషన్ల కోసం ప్రజల ఇబ్బందులు
ప్రభుత్వం, అధికారులు ఎందుకు స్పందించడం లేదని
10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ ప్రశ్న



**దుగ్గొండి, (సింగిడి):** నర్సంపేట మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌పై కమిషనర్‌గా కొనసాగుతున్న అధికారి డిప్యూటేషన్ గడువు ముగిసినప్పటికీ, కొత్త కమిషనర్‌ను నియమించకపోవడం, ప్రస్తుత కమిషనర్ కొనసాగింపు పై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయకపోవడం వల్ల మున్సిపల్ పరిపాలనలో తీవ్ర గందరగోళం నెలకొందని 10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ విమర్శించారు. కమిషనర్‌కు సంబంధించిన డిజిటల్ కీ గత నెల రోజులుగా హోల్డ్‌లో ఉండటంతో డెత్ సర్టిఫికెట్లు, బర్త్ సర్టిఫికెట్లు, ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తుల మ్యుటేషన్లు, ట్రేడ్ లైసెన్సులు తదితర ప్రజలకు నేరుగా సంబంధించిన సేవలు నిలిచిపో యాయని తెలిపారు. మరణించిన వారి కుటుం బాలకు అవసరమైన డెత్ సర్టిఫికెట్లు, పిల్లల బర్త్ సర్టిఫికెట్లు, ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తుల మ్యుటేషన్ల కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్నా పనులు పూర్తికాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అత్యవసరమైన సేవలు కూడా అందకపోవడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కమిషనర్ డిప్యూటేషన్ గడువు ముగిసే విషయం ముందే తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని శ్రీధర్ ప్రశ్నించారు. పరిపాలనా నిర్ణయాల్లో జరుగుతున్న జాప్యానికి సామాన్య ప్రజలు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని నిలదీశారు. ప్రస్తుత కమిషనర్ డిప్యూటేషన్‌కు సంబంధించి కొత్త ఉత్తర్వులు జారీ చేశారా లేకపోతే ఏ అధికారిక ఉత్తర్వుల ఆధారంగా కొనసాగుతున్నారో సీ డీ ఎం ఏ తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్ గడువు ముగిసిన తర్వాత కొనసాగింపు పై అధికారిక ఉత్తర్వులు లేకుంటే దాని పై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. నెల రోజులుగా ప్రజలకు సంబంధించిన కీలక మున్సిపల్ సేవలు ప్రభావితమవుతున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని శ్రీధర్ అన్నారు. తక్షణమే డిజిటల్ కీని పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న డెత్, బర్త్ సర్టిఫికెట్లు, ట్రేడ్ లైసెన్సులు, ఇంటి నంబర్లు, మ్యుటేషన్లు తదితర పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కమిషనర్ డిప్యూటేషన్‌పై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసి నర్సంపేట మున్సిపల్ పరిపాలనను వెంటనే గాడిలో పెట్టాలని కోరారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన..

**మెట్‌పల్లి, (సింగిడి):** పట్టణంలోని 8వ వార్డులో రూ. 2 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వార్డులో మురుగునీటి పారుదల సమస్యను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్,



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ ధీవకొండ మానసవిష్ణు, నాయకులు పురుషోత్తం, అజయ్, నరేష్, ఆనంద్, పుదారి సుధాకర్, పెద్ద సలీం, కిషోర్, వేణుగోపాల్, లింగేశ్వర్, మొరపు తేజ, జావిద్, రవి తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనా రాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నా రు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ ఓ సి అందజేయడం జరుగుతుం దని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గైనీ గంగారం పదవి విరమణ వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు, నీటిపారుదల శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ సూపరింటెండెంట్ గా పని చేసిన గైని గంగారాం పదవి విరమణ మహోత్సవంగా ఘంగా నిర్వహిం చారు. సోమవారం టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వ ర్యంలో నగరంలో గల శ్రీరామ గార్డెన్స్ టిఎన్ జిఓ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ నేతగా, ఇరిగేషన్ లో గత 40 సంవత్సరాలుగా పనిచేసిన గైనీ గంగారం పదవి విరమణ వేడుకలకు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేని (ముజీబ్), వ్యవసాయ శాఖ కమిషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడుపు గంగాధర్, నుడా చైర్మన్ కేశవ వేణు తో పాటు ఇతర నాయకులు, ఉద్యోగులు గైని విద్యావతి – గంగారం ఆదర్శ దంపతులను శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ జ్ఞాపికను అందజేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉద్యోగ సంఘ నాయకులుగా ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత గైనీ గంగారంకే దక్కిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, టీఎన్జీవో కోశాధికారి నిరంజన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని శాఖల ఉద్యోగులు, అధిక సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

**భీమదేవరపల్లి, (సింగిడి):** అర్హులైన, పేదలు మరియు వల్నరబుల్ వర్గాల ప్రజలకు శుభవార్త. చేవూత సామాజిక భద్రత పింఛన్ల కొత్త మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15, 2026 వరకు పొడిగిస్తూ తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నిర్ణయం తీసుకుంది అని భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం ఒక ప్రకటన లో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 వరకు గడువు ఉండగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేందుకు మరోసారి గడువు పొడిగించారు. పొడిగించిన గడువును అర్హులైన లబ్ధిదారులకు విస్తృతంగా తెలియజేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశిం చారు. దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# వెయ్యిరోజుల ప్రభుత్వ వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరీ

కీలక నేతల సమావేశంలో మాజీ ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్



**హన్మకొండ, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన విఫలమైన నేపద్యంలో బీ ఆర్ ఎస్ పార్టీ మ్రోగించనున్న సమరభేరిని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రం లోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కీలక నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వినయ్ బాస్కర్ మాట్లాడుతూ మాజీ మంత్రి బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ ఆర్ పిలుపు మేరకు ముఖ్యనాయకుల

సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 2 నుంచి 9 వ తేదీ వరకు వారం రోజుల పాటు కాంగ్రెస్ చేసిన మోసాల పై బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోరుబాటకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 420 హామీల మోసంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. వెయ్యి రోజులైనా ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చని హామీల పై ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా కాంగ్రెస్ హామీల వైఫల్యం,అవినీతిని ఎండగట్టి విస్తృతంగా ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు. సమావేశంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు,లీగల్ సెల్ బాధ్యులు, మహిళా డివిజన్ ప్రెసిడెంట్లు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ





**మల్హర్ (సింగిడి):** మల్హర్ మండ లంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అం దిస్తున్న ఉచిత పాఠశాల యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు గీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ చేయడం ద్వారా వారిలో సమానత్వ భావన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ బండి స్వామి, ఎంపీడీవో క్రాంతి కుమార్, కళ్యాణ్, ఏపిఎం హనుమంతరావు, సీసీ వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు గీత, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సరిత, సి ఆర్ పి సమత, ఇందిరా మహిళా శక్తి సంఘం సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

నర్స్ శిరీష హత్యపై తీవ్ర ఆగ్రహం.. కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ డిమాండ్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నర్స్ శిరీష హైదరాబాద్ పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుక్కుగూడ వద్ద అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై కుల సంఘాల జేఏసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా చైర్మన్ పీక కిరణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరీష మృతి పై సమగ్ర దర్యాప్తు జరిపి, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న శిరీష రూమ్‌లో మృతి చెందిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పీక కిరణ్ పేర్కొన్నారు. ఘటనపై పూర్తి స్థాయి లో దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలుగులోకి



తీసుకురావాలని కోరారు. బాధితురాలి మిత్రులు ఆమెపై దాడి జరిగినట్లు,ఒంటి పై గాయాలు ఉన్నట్లు చెబుతున్న నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని జేఏసీ జిల్లా కో–కన్వీనర్ రామగిరి రాజు కోరారు. నిందితులు ఎవరైనా ఉంటే వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవలందించే నర్సులు, ఉద్యోగినుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పీక కిరణ్ కోరారు. పని ప్రదేశాలతో పాటు ఉద్యోగినులు నివసించే ప్రాంతాల్లోనూ భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. శిరీష కుటుంబానికి పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు ‘జస్టిస్ ఫర్ శిరీష’ పేరుతో కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని పీక కిరణ్ స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎంపీడీవో చొరవతో నర్సింగాపూర్ పంచాయతీకి తెర

పంచాయతీ తీర్మానం లేకుండా నోటీసులు

కార్యదర్శి నయీంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీడీవో

బిల్లులల్లో వాటా విషయంపై వార్డు సభ్యుల ఆరోపణ



**ధర్మారం (సింగిడి):** మండ లంలోని నర్సింగాపూర్ గ్రామపంచాయతీలో జీపి కార్మికులకు కార్యదర్శి ఎండ నయీమ్ నోటీసులు జారీ చేసిన విషయంలో ఈరోజు మండల అభివృద్ధి అధికారి వేముల సుమలత స్వయంగా ఉదయం నర్సింగాపూర్ గ్రామపంచాయతీ చేరుకొని బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విషయంలో వార్డు సభ్యులు మరియు జీపీ కార్మికులు కారోబార్, ఆసక్తికర విషయాలు వెల్లడించారు వీరికి తోడు గ్రామస్తులు కూడా తోడయ్యారు అందరూ ముకుమ్మడిగా గ్రామపంచాయతీ కార్యదర్శి పై ఎంపీడీవో సుమలతకు వివరించారు. రాఖీ పౌర్ణమి రోజు కార్మికులు డ్యూటీ చేయాలని ఒత్తిడి చేసి అలాగే గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయం పై ఏర్పాటు చేసిన గ్రామ ఫోన్ రికార్డర్ ను బందు చేశాడని గ్రామస్తులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. అలాగే గ్రామ సభ నిర్వహణ పై కూడా పలు సందేహాలు వార్డు సభ్యులు ఎంపీడీవో ఎదుట వ్యక్తం చేశారు. ఈ కార్యదర్శి మన గ్రామ లో డ్యూటీ చేసిన అన్ని రోజులు మేము విధులకు హాజరుకామని వారు పట్టుపట్టారు ఎంపీడీవో వేమన సుమలత కలుగజేసుకొని ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఇదే విషయం గానీ మరే విధమైన ఆరోపణ కార్యదర్శి నయీశీపై వచ్చినట్లయితే వెంటనే సస్పెండ్ చేస్తానని గ్రామస్తులకు ఆమె హామీ ఇచ్చారు ఇంతటితో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో సర్పంచ్ కొము రయ్య, మరియు వార్డు సభ్యులు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపిటిసి బద్దం అజయ్ పాల్ రెడ్డి బద్దం లింగారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి చల్ల గంగారెడ్డి గుండా మైపాల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కార్యదర్శి నయీమ్ వ్యవహారంపై బిజెపి నాయకుల అభ్యంతరం....**

నర్సింగాపూర్ గ్రామపంచాయతీ కార్మికుల రాఖీ పౌర్ణమి రోజు డ్యూటీ చేయాలని నోటీసుల వ్యవహారం అలాగే గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాల యం పై ఏర్పాటుచేసిన మైక్ సెట్ ను బంధు చేశాడని, గ్రామస్తుల నుండి అభ్యంతరం వ్యక్తం కావడంతో ఈ విషయాలపై బిజెపి నాయకులు పట్టు పట్టారు. ఈ రెండు విషయాలు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని ఈ విషయంపై మేము ఆందోళన వ్యక్తం చేస్తున్నామని ఎంపీడీవో సుమలత ముందు ఆరోపించి , గ్రామ కార్యదర్శి వెంటనే ఈ రెండు విషయాలపై సారి చెప్పాలని పట్టుబట్టారు. వెంటనే కార్యదర్శి సారీ చెప్పించడంతో ఈ విషయం కూడా సర్దుమనింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుండా వెంకటరెడ్డి మండల నాయకులు మేడవేణి శ్రీనివాస్, లక్ష్మణ్ గోని సాయి ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు దండవెని తిరుపతి ఐడి సెల్ కన్వీనర్ కుక్కల బాలకృష్ణ చీకట్ల రాజశేఖర్ ఆకులు లచ్చన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తీర్మానాలు కాగితాలకే పరిమితం

కౌన్సిల్ నిర్ణయాలను అమలు చేయకపోవడంపై వైస్ చైర్మన్ డాక్టర్ అనిత, బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం.
కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ కౌన్సిలర్ల ధర్నా పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్



**కాగజ్ నగర్ (సింగిడి):** కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రోజురోజుకూ పెరుగుతున్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత, బిఆర్ఎస్ బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక మున్సిపల్ పాలన తీరుపై వారు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ?ఈ నిరసన సందర్భంగా కౌన్సిలర్ వలి మాటాడుతూ, మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ పట్టణాభివృద్ధిని, ప్రజా సమస్యలను అధికారులు తూతూమంత్రంగా నడుపుతున్నారని విమర్శించారు. పట్టణంలో ప్రధానంగా వీధిలైట్లు వెలగకపోవడం, వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై చైర్మన్ కమిషనర్ల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి తీర్మానం కావాలని చెబుతున్న అధికారులు, తమ బిఆర్ఎస్ కౌన్సిలర్లు రెండు నెలల క్రితమే రాతపూర్వకంగా తీర్మానం ఇచ్చినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత మాట్లాడుతూ, కాగజ్‌నగర్‌లోని పలు కాలనీల్లో దోమల ఉధృతి తీవ్రంగా ఉందన్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని లేవనెత్తుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి కాలనీలో రోజూ ఫాగింగ్ నిర్వహించాలని కౌన్సిల్‌లో నిర్ణయించినప్పటికీ, ఆ తీర్మానాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని దుయ్యబట్టారు. ?పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రధాన సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ప్రజా క్షేత్రంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## మంచిర్యాలలో నంబర్ ప్లేట్ల స్పెషల్ డ్రైవ్

12 ద్విచక్రవాహనాలు సీజ్..
40 వాహనాలకు జరిమానా



**మంచిర్యాల, (సింగిడి):** నంబర్ ప్లేట్ లేకుండా.. అస్పష్టమైన నంబర్ ప్లేట్లతో.. వాటిని టాంపరింగ్ చేసి వాహనాలు నడిపితే ఇకపై కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. పట్టణంలో నంబర్ ప్లేట్ల నిబంధనల ఉల్లంఘనపై సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయగా.. మరో 40 వాహనాలకు జరిమానాలు విధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేకుండా, నంబర్లు స్పష్టంగా కనిపించకుండా, నంబర్ ప్లేట్లను మార్పులు చేసి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు.

**నేరాల నియంత్రణలో కీలకం**

వాహనాలకు స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ హసన్ సూచించారు. నంబర్ ప్లేట్లు లేకపోవడం లేదా నంబర్లు అస్పష్టంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను గుర్తించడం కష్టమవుతుందని తెలిపారు. అదేవిధంగా నేరాల్లో ఉపయోగించిన వాహనాలను గుర్తించడంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు.

**నిరంతరం తనిఖీలు**

నంబర్ ప్లేట్ల నిబంధనలపై ఇకపై కూడా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని సీఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.

## మంత్రాల పేరుతో భయభ్రాంతులకు గురిచేసిన పూజారిపై కేసు

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):** మంత్రాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఓ పూజారిపై కౌటాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం వీర్దండి గ్రామంలో చోటుచేసుకుంది. కౌటాల ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..వీర్దండి గ్రామానికి చెందిన జాడే నందు కుమారుడు రాహుల్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నందు మహారాష్ట్రలోని గొజ్జోలి గ్రామానికి చెందిన పూజారి కోవే గణపతిని సంప్రదించినట్లు తెలిసింది. రాహుల్ అనారోగ్యానికి వీర్దండి గ్రామానికి చెందిన జాడే నానాజీ మంత్రాలు చేయడమే కారణమని పూజారి చెప్పినట్లు సమాచారం. దీంతో నందు.. నానాజీ ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై నానాజీ కౌటాల పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు మహారాష్ట్ర గొజ్జోలి గ్రామానికి చెందిన పూజారి కోవే గణపతిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మూఢనమ్మకాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు.

## టీ షాపుల బంద్.... నిత్యవసర ధరల పెంపుపై నిరసన




**మంథని, (సింగిడి):** చక్కెర ధరతో పాటు నిత్యవసర సరుకుల ధరలు అమాంతం పెరగడాన్ని నిరసిస్తూ సోమవారం మంథని పట్టణంలోని అన్నిటీ షాపులు స్వచ్ఛందంగా మూసివేశారు. పాల ధర, చక్కెర, టీ పొడి ధరలు భారీగా పెరగడంతో టీ షాపుల నిర్వహణ భారంగా మారిందని చాయ్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధరల పెంపును వెంటనే నియంత్రిం చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ బంద్ కు పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ బంద్ లో మంథని పట్టణంలోని ప్రముఖ టీ షాపులు సిటీ టీ ప్యాలెస్, చిరు టీ స్టాల్, లక్కీ టీ స్టాల్, ఉడిపి హోటల్ టీ స్టాల్, మొగిలి టీ స్టాల్ పలు షాపుల యజమానులందరూ పాల్గొన్నారు.

## పెన్షన్ విద్రోహదిన నిరసనకు తరలిరండి.

టిఆర్‌టిఎఫ్ పిలుపు.



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం మధ్యాహ్నం భోజన విరమణ సమయంలో వివిధ జిల్లా కేంద్రాలలో ఉద్యోగులు పనిచేస్తున్న కార్యాలయం ముందు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసనను తెలియజేయడా నికి తరలిరావాలని టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్ గడ్డం భూమన్నలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2004 నుండి నూతన పెన్షన్ విధానమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును అమలు చేయడం వల్ల రాష్ట్రంలో సుమారు రెండు లక్షల అరవై వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని కావున ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన ఏ విధంగా జరుగుతున్న ఉద్యమంలో రేపు పెన్షన్ విద్రోహ దినం నిర్వహించడం జరుగుతుందని కావున ఏ నిరసన కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వానికి మన నిరసనలు తెలియజేయాలని వారు పిలుపునిచ్చారు.

## చేయూత పెన్షన్ల గడువు
## 15 రోజులు పెంచిన ప్రభుత్వం

**ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**
**మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్ల గడువును 15 రోజులు పెంచిందని సెప్టెంబర్ 15 వరకు చేయూత పెన్షన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత పెన్షన్ల గడువు గతంలో ఆగస్టు 31 వరకు ఉండగా సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు తాజాగా సేర్ప్ సీఈవో సోమవారం ఒక సర్కులర్ జారీ చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీపీ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలి

**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నేర పరిశోధన, నేరస్తుల వివరాల నమోదు వ్యవస్థలో పొందుపరచాలని ఆదేశించారు. పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన వివిధ సాంకేతిక వ్యవస్థలపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకుని, రోజువారీ విధుల్లో సమర్థంగా వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రథమ సమాచార నివేదికల సూచికను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి కారణాలను తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతర పోలీస్ పర్యవేక్షణపై దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్ పరిధిని విభాగాలు, ఉపవిభాగాలుగా విభజించి ప్రాంతాల వారీగా పోలీసు అధికారులను కేటాయించడం ద్వారా ప్రజలకు పోలీసుల సేవలు మరింత చేరువ చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి నెలా తాజా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. తనిఖీలో త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ తిరుమల్‌గౌడ్‌తో పాటు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు




# ఈశ్వర సేవలో చైతన్య విద్యార్థులు

**భిక్కనూర్, (సింగిడి):** శ్రావణ సోమవారం సందర్భంగా శ్రీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో బిక్కనూర్ చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ఆలయం వద్ద వాలంటీర్లుగా సేవలందించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల నిర్వహణతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సేవలను ఆలయ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి, డైరెక్టర్ అందె దయాకర్‌రెడ్డి అభినందించారు. సేవాభావంతో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భూర్ల రేణు కుమార్, హెడ్‌మాస్టర్ అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం..**



**భిక్కనూర్, (సింగిడి):** భిక్కనూర్ పాత హరిజనవాడకు చెందిన దుబ్బాషి సత్యగంగ, భిక్షపతి దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్ నూతన వస్త్రాలు అందించి, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటి కల సాకారం కావడం సంతోషకరమని పేర్కొన్నారు.

## చేవూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

**భీమదేవరపల్లి, (సింగిడి):** అర్హులైన, పేదలు మరియు వల్నరబుల్ వర్గాల ప్రజలకు శుభవార్త. చేవూత సామాజిక భద్రత పింఛన్ల కొత్త మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15, 2026 వరకు పొడిగిస్తూ తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ నిర్ణయం తీసుకుంది అని భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం ఒక ప్రకటన లో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 వరకు గడువు ఉండగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేందుకు మరోసారి గడువు పొడిగించారు. పొడిగించిన గడువును అర్హులైన లబ్ధిదారులకు విస్తృతంగా తెలియజేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## మటన్, చికెన్ వ్యాపార నిర్వాహకులపై ప్రజావాణిలో ఫిర్యాదు



**మల్యాల, (సింగిడి):** మల్యాల మండల కేంద్రం తో పాటు గ్రామాలలో మటన్, చికెన్ వ్యాపార నిర్వాహకులపై సోమవారం స్థానిక యువకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చేశారు మటన్, చికెన్ సెంటర్ల యజమానులు పరిశుభ్రత పాటించడం లేదని తునికల్లో నిబంధనల ప్రకారం పాటించడం లేదని మురికి కాలువలపై అలాగే రోడ్లపై మటన్ షాపులు నిర్వహిస్తూ దోమలు ఈగలు వాలిన మాంసాన్ని విక్రయిస్తున్నారని దీనివలన ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు . మాజీ ఎంపిటిసి రాచర్ల రమేష్, మధు, మల్లేశం తదితరులు ఉన్నారు.

## టోల్ ప్లాజా వద్ద కనీస సదుపాయాలు కల్పించాలి

**బీఆర్ఎస్ కాటారం మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రామిళ్ళ రాజబాపు**

**జాతీయ రహదారి చీఫ్ ఇంజనీరింగ్ అధికారికి ఫిర్యాదు**

**కాటారం, (సింగిడి):** మేడిపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనదారుల నుంచి టోల్ రుసుములు వసూలు చేస్తున్నా ప్రయాణికులకు కనీస సదుపాయాలు కల్పించడం లేదని కాటారం మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రామిల్ల రాజబాపు ఆరోపించారు. ఈ మేరకు జాతీయ రహదారి చీఫ్ ఇంజనీరింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. టోల్ పరిధిలో రహదారులు గుంతలమయంగా మారాయని, రాత్రివేళ స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైట్లు వెలగక ప్రమాదాల ముప్పు ఉందన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, బాత్రూమ్ సదుపాయాలు లేవని పేర్కొన్నారు. ఇటీవల టోల్ సమీపంలో కారు దగ్ధమైన ఘటన నేపథ్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, అగ్నిమాపక పరికరాలు, రక్షణ సిబ్బంది అందుబాటుపై అధికారులు పరిశీలించాలని కోరారు. టోల్ యాజమాన్యంపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పౌర హక్కులపై అవగాహన అవసరం



**భిక్కనూర్, (సింగిడి):** భిక్కనూర్ మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.మంగ, ఆర్ఐ నజీముద్దీన్, హెడ్ కానిస్టేబుల్ అంజయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చేతి రాత అభివృద్ధి పైశిక్షణ



**మల్యాల, (సింగిడి):** మండలంలోని ముత్యంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం లోడి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మద్రి మల్లేశం, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పూడూరు గంగ స్వామి ఆధ్వర్యంలో విద్యార్థిని-విద్యార్థులకు చేతిరాత అభివృద్ధిపై శిక్షణ ఇచ్చి సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ దారం ఆది రెడ్డి, ఉప సర్పంచ్ కందరి ముత్యంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, దశరథ్ రెడ్డి ,శ్రీనివాస్, గంగా, అనూష, తదితరులున్నారు.

## లబ్ధిదారుల చేతికి.. స్మార్ట్ రేషన్ కార్డులు

**అంతంపల్లి గ్రామపంచాయతీ వద్ద నేడు అర్హులకు పంపిణీ**




**బిక్కనూర్, (సింగిడి):** అంతంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నేడు ఉదయం 9:30 గంటలకు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై తమ స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించాలని గ్రామ సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి, పాలకవర్గం సూచించారు. లబ్ధిదారులు నిర్ణీత సమయానికి గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

## దాడులతో బీజేపీని అడ్డుకోలేరు

**కాంగ్రెస్ గూండాయిజానికి నిదర్శనం: తడుక వినయ్‌గౌడ్.**



**నల్లబెల్లి, (సింగిడి):** నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని బీజేపీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడుక వినయ్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి కాంగ్రెస్ పార్టీ అసహన రాజకీయాలకు, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ నాయకులకు లేకనే దాడులు, విధ్వంసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో బీజేపీ బలపడుతుండటాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు దిగుతున్నారని అన్నారు. రాజకీయంగా సమాధానం చెప్పాల్సిన చోట దాడులకు పాల్పడటం చేతకాని రాజకీయాలకు పరాకాష్ఠ అని పేర్కొన్నారు. బీజేపీకి రాజ్యాంగం, చట్టం, ప్రజాస్వామ్యంపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. తమ సంయమనాన్ని చేతగానితనంగా భావిస్తే అది కాంగ్రెస్ నాయకుల రాజకీయ అజ్ఞాన మేనని అన్నారు. దాడులతో బీజేపీని ఆపలేరని, బెదిరింపులతో కార్యకర్తలను భయపెట్టలేరని, కేసులతో పార్టీ పోరాటాన్ని నిలువరించలేరని స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. రాజకీయ కార్యాలయాలపై దాడులకు తావులేకుండా ప్రభుత్వం బాధ్యతగావ్యవహరించాలని కోరారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం ఉంటే ప్రజల మధ్యకు వచ్చి విధానాలతో పోరాడాలని, దాడులు చేసి బీజేపీని అడ్డుకోవాలని చూస్తే అది కాంగ్రెస్ నాయకుల భ్రమేనని తడుక వినయ్‌గౌడ్ అన్నారు.

# విరమణ పదవికి తప్ప... వ్యక్తికి కాదు!

**ఎంతోమంది విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్న అశోక్ రాజ్ సార్‌కు ఘన వీడ్కోలు**



**హుస్నాబాద్ (సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఉపాధ్యాయుడు అశోక్ రాజ్ సార్ పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమం ఆత్మీయత, భావోద్వేగాల మధ్య ఘనంగా జరిగింది. "విరమణ పదవికి తప్ప... వ్యక్తికి కాదు" అంటూ పలువురు విద్యార్థులు అశోక్ రాజ్ సార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యా బోధనతో పాటు క్రమశిక్షణ, మానవీయ విలువలు, ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులను నడిపించిన ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. "అశోక్ రాజ్ సార్ మా గురువు మాత్రమే కాదు.. మా జీవితాలకు మార్గదర్శి. ఆయన బోధనలు, ఇచ్చిన ప్రోత్సాహం జీవితాంతం మాతోనే ఉంటాయి" అని భావోద్వేగానికి గురయ్యారు. సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ అశోక్ రాజ్ సార్ అందించిన సేవలు విద్యారంగంలో చిరస్మరణీయమని, ఆయన పదవీ విరమణతో ఒక అధ్యాయం ముగిసినా విద్యార్థుల హృదయాల్లో ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొని అశోక్ రాజ్ సార్‌ను ఘనంగా సన్మానించి, ఆయన భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేందర్, ఉపాధ్యాయ సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# నా భూమికి రెవెన్యూ అధికారులు హద్దులు చూపించాలి..!

**సర్వేయర్ డబ్బులు తీసుకున్నా హద్దులు చూపించలేదని బాధితుడి ఆరోపణ..?**
**సర్వేయర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు..!**

**హుస్నాబాద్, (సింగిడి)::** తన భూమికి రెవెన్యూ అధికారులు హద్దులు చూపించి న్యాయం చేయాలని కోరుతూ దళిత బాధితుడు కత్తుల ఎల్లయ్య సోమవారం హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ అక్కన్నపేట మండలం గండిపల్లి రెవెన్యూ శివారులోని చౌటకుంట తండా పరిధిలో తనకు ప్రభుత్వం 5 ఎకరాల ఒక గుంట భూమిని కేటాయించిందని తెలిపారు. తన భూమికి హద్దులు నిర్ణయించి చూపించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. తన భూమిని కొంతమంది గిరిజనులు దేవతల పేర్లతో అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం తన భూమికి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులు సర్వేయర్ లక్ష్మీనారాయణను ఆదేశించారని, అయితే హద్దులు చూపించాలంటే రూ. 20 వేల ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేశారని ఎల్లయ్య ఆరోపించారు. సర్వేయర్ అడిగిన మొత్తాన్ని తాను ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తన భూమికి హద్దులు చూపించలేదని, సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వేయర్‌పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇప్పించడంతో పాటు తన భూమికి సంబంధించిన హద్దులను అధికారికంగా నిర్ణయించి చూపించాలని బాధితుడు కోరారు.



**అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలి...!**

ప్రభుత్వ భూములు, పట్టా భూములు, సర్వేలు, హద్దుల విషయంలో ప్రజలు రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తే వాటిపై ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పేదలు, దళితులు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల నుంచి లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవినీతికి తావులేకుండా రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతను పెంచాలని పలువురు కోరుతున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు..

**ఫ్లాట్ల విక్రయాలపై ప్రజావాణిలో ఫిర్యాదు**



**భీమదేవరపల్లి (సింగిడి):** వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లుగా మార్చి ఫ్లాట్ల విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల స్థాయి ప్రజావాణి (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేశారు. భీమదేవరపల్లి మండలంలో ఉమ్మడి కొత్తపల్లి గ్రామ అబాదికి సంబంధించిన సర్వే నంబర్ 266 లోని వ్యవసాయ భూమి విషయంలో ఈ ఫిర్యాదు చేసినట్లు కొత్తపల్లి 8వ వార్డు సభ్యుడు నడిగోటి నరేష్ తెలిపారు. వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు చేయడం వ్యాపారంగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రజలు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్లాట్ కొనుగోలు చేసే ముందు లింక్ డాక్యుమెంట్లు, నాలా కన్వర్షన్, ఈసీ, పహాణి తదితర పత్రాలను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్‌కు అనుమతులు ఉన్నాయా లేదా నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు.
ప్రభుత్వానికి, గ్రామపంచాయతీకి చట్టబద్ధంగా చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యవహారాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతు ఇవ్వకూడదని నరేష్ కోరారు. అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేని ప్లాట్ల విక్రయాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ములుకనూరు డెయిరీ
## సభ్యులకు శుభవార్త..
## పాల సేకరణ ధరలు పెంపు

**భీమదేవరపలి (సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు డెయిరీ సభ్యుల కు పాల సేకరణ ధరలను పెంచుతూ డెయిరీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు సెప్టెంబర్ 1, 2026 ఉదయం నుంచి అమల్లోకి రానున్నాయి. డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సగటున ఆవు పాలకు లీటరుకు రూ. 1.25, గేదె పాలకు లీటరుకు రూ. 3.50 చొప్పున ధర పెంచినట్లు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ధరల పెంపు నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. పెరిగిన ధరలతో డెయిరీ సభ్యులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కోదాడ సీఐపై చర్యలు తీసుకోవాలి: దళిత నాయకుడు బెల్లంపల్లి రాజు

**భీమదేవరపల్లి (సింగిడి):** కోదాడ సీఐ శివశంకర్ ఓ వ్యక్తిపై దాడి చేశారంటూ వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు బెల్లంపల్లి రాజు డిమాండ్ చేశారు. హనుమ కొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ముల్కనూర్ లో మాట్లాడుతూ,మండల ఉపేందర్‌పై దాడి చేయడంతో పాటు కారులో ఇసుక తరలించేందుకు ఒత్తిడి చేశారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అమాయకులపై దాడులకు పాల్పడటం, తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో పోలీసుల తీరుపై వస్తున్న ఫిర్యాదులపై డీజీపీ స్పందించి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఐహెచ్‌ఆర్‌పిసి జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల వెంకటేష్

**భీమదేవరపల్లి ,(సింగిడి):** అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ మండలి (ఐహెచ్‌ఆర్‌పిసి) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల వెంకటేష్‌ను నియమించింది. ఈ నియామకం సెప్టెంబర్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చినట్లు సంస్థ ప్రధాన కార్యాలయం ఆర్మూర్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, సామాజిక న్యాయం తదితర అంశాల్లో మండలి కార్యకలాపాలను బలోపేతం చేయడం వెంకటేష్ బాధ్యతగా ఉంటుందని తెలిపింది. కొత్త బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌కు ఐహెచ్‌ఆర్‌పిసి జాతీయ నాయకత్వం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా సంస్థ జాతీయ అధ్యక్షుడు ఎస్.కె. మజీద్ వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కరీంనగర్ జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.




# ఇందిరమ్మ పథకంతోసొంతింటి కల సాకారం

**మల్యాల ,(సింగిడి):** ఇందిరమ్మ పథకం ద్వారా పేద ప్రజలకు సొంత ఇంటి కల సహకారం అయిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండలంలోని తక్కల్లపల్లి గ్రామానికి చెందిన గంపల లావణ్య-స్వామి కి చెందిన ఇందిరమ్మ పథకం ద్వారా చేపట్టిన గృహాన్ని పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి నూతన గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి మరాఠి లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి నక్క అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముప్పారపు సాగర్, సింగిల్ విండో డైరెక్టర్ సుల్తాన్ లచ్చయ్య, నరసింహారెడ్డి, బి వి రమణ, తదితరులు ఉన్నారు.



## శివయ్యకు అన్నపూజ.. భక్తులకు అన్నదానం.

**భిక్కనూర్,ఆగస్టు31(నినాదం):** శ్రావణ మాసం సోమవారం సందర్భంగా భిక్కనూర్‌లోని శ్రీ సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం భక్తుల సందడితో శోభాయమానంగా మారింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్, బిచ్కుందకు చెందిన కోలవార్, కాపర్తి కుటుంబ సభ్యులు 100 కిలోల బియ్యంతో అన్నపూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యం

## హనుమకొండ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య

**హనుమకొండ, (సింగిడి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య పేర్కొన్నారు. హనుమకొండ సుబే దారిలోని ఒక ఫంక్షన్ హాల్ లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న డెమో వేముల అశోక్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం అట్ట హాసంగా జరిగింది . ఈ కార్యక్రమానికి పలువురు ఉద్యోగులతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పాల్గొన్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఏ. అప్పయ్య హాజరై మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘంగా పనిచేసిన డెమో అశోక్ రెడ్డి పదవి విరమణ బాధాకర మైనప్పటికీ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదనీ ఆయన గుర్తు చేశారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ





సమయంలో పలువురి వక్తల ప్రశంసలు పొందుతు న్న అశోక్ రెడ్డి ఆయన వృత్తి పట్ల ఉన్న అంకితభావం స్పష్టమౌతుందని ఆయన కొనియాడారు. అశోక్ రెడ్డి అందరివాడిగా ఆజాతశత్రువుగా తోటి ఉద్యో గులతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంచి పేరు తెచ్చుకో వడం అదృష్టంగా భావించ వచ్చు న ని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత పనుల కంటే విధుల పట్ల అంకితభావంతో పని చేయడం వల్లే అశోక్ రెడ్డికి పలువురి ప్రశంశలు దక్కయన్నా రు. తొలుత అశోక్ రెడ్డి ఆయన సతీమణికి తోటి ఉద్యోగులు శాలువాలతో సత్కరించి పూల మాలలు వేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికా రులు, ఇతర జిల్లాల అధికారులు ఆంధ్రా వైద్య శాఖ అధికారులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధికి విద్య ప్రధాన మార్గం





## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు

**సంగారెడ్డి బ్యూరో , (సింగిడి)::** సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించి అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించేందుకు విద్య ఒక్కటే ప్రధాన మార్గమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమ వారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో సంచార జాతుల విముక్తి దినోత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా ఫూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ పాండు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,మనుషులను కులాలు, జాతుల పేరుతో విభజించి చూడ కుండా ప్రతి ఒక్కరూ సమానంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని సూచించారు. సమాజం లోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కులం, జాతి, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచిం చారు. మనిషి తన ఆశయానికి అనుగుణంగా ఉన్నత హోదాలను సాధించడానికి విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ శాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంచార జాతులు, వెనుకబడిన తరగతులకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు, సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యే శాశ్వతమైన మార్గమని అన్నారు. “చదువు ఒక్కటే అభివృద్ధికి పరిష్కారం” అనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తించాలని పిలుపునిచ్చారు. సంచార జాతులు, విముక్త జాతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎంబీసీ జిల్లా అధ్యక్షులు హనుమంతు, ఎంబీసీ సంచార జాతుల కార్యదర్శి వినోద్, వీరభద్రుల కులాల అధ్యక్షులు అలుగు మల్లేశం, జంగమ ఎంబీసీ రాష్ట్ర కార్యదర్శి వీరేశం, వీరభద్రుల కులాల జిల్లా అధ్యక్షులు మోహన్ బాబు, ఎంబీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌తో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలారం చెరువు.. నిండుకుండ..

**సాగునీటికి రైతుల ఎదురుచూపులు!**
**చెరువులో నీరు ఉన్నా.. పొలాలకు అందని వైనం**
**కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఫైర్**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (మహాముత్తారం)(సింగిడి)::** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పోలారం చెరువు నిండుకుండలా నీటితో కళకళ లాడుతోంది. అయితే చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మార్కరాము గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు నాయకులు పోలారం చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. చెరువు నిండా నీరు కళ్లముందే కనిపిస్తున్నా.. తమ పంటలకు మాత్రం సాగునీరు అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని టిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, మండల నాయకులు విమర్శించారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రాకముందే పోలారం చెరువు నీటిని వెంటనే విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతుల సమస్యపై తక్షణమే స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. చెరువులో నీరు ఉన్నప్పటికీ సాగుకు వినియోగించుకోలేని పరిస్థితిపై అధికారులు దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే 2008లో ప్రారంభమైన చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పేరును ప్రస్తావిస్తూ పలుమార్లు ఎన్నికల్లో గెలిచి మంత్రిగా కొనసాగినప్పటికీ.. ప్రాజెక్టును ఇప్పటికీ పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రాజెక్టు పేరును ఎన్నికల సమయంలో ప్రస్తావించడం కాకుండా రైతులకు వాస్తవంగా సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీరు ఇవ్వకుంటే పోరాటమే పోలారం చెరువు నుంచి సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని, రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మార్క రాముగౌడ్ స్పష్టం చేశారు.

# కృష్ణా జలాల పరిరక్షణకు బీఆర్ఎస్ పోరాటం

## సెప్టెంబర్ 3న మిర్యాలగూడలో రైతు మహాధర్నా: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



**మిర్యాలగూడ, (సింగిడి):** ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా చేపడు తున్న ప్రాజెక్టులు, కృష్ణా జలాల తరలింపుపై తెలంగాణ ప్రభుత్వం మౌనం వహిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎస్. జగదీష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మిర్యాలగూడలోని టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూఢిల్లీ లాబీయింగ్, రాజకీయ ప్రయో జనాల కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై నోరు మెదపడం లేదని ఆరోపించారు. నాగార్జునసాగర్ నీటిని తెలంగాణకు సమర్థవం తంగా వినియోగించుకోకుండా రాష్ట్ర రైతాంగాని కి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తున్నా అడ్డుకోక పోవడం వల్లనల్గొండ జిల్లా సాగర్ ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుడి కాల్వ కింద పంటలు పండు తుంటే, తెలంగాణలో ఎడమ కాల్వ కింద రైతుల పొలాలు ఎందుకు ఎండిపోతున్నాయని ప్రశ్నిం చారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఏడు రోజుల పాటు నిరసనలు**

రైతుల హక్కులు, కృష్ణా జలాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వం లో రైతు ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగి స్తామని అన్నారు. సెప్టెంబర్ 3న రైతు మహాధర్నా వచ్చే నెల 3న మిర్యాలగూడ రాజీవ్ చౌక్ ( రౌండ్)లో రైతు మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సాగర్ ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా, రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ, మహిళలకు రూ. 2,500 వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

**సాగర్‌ను ముట్టడిస్తాం**

సాగర్ ఎడమ కాల్వతో పాటు ఏఎంఆర్‌పీ కింద కృష్ణా జలాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ‘చలో సాగర్’ పేరుతో సాగర్ ముట్టడి కార్యక్రమం చేపట్టి తమ హక్కైన నీటిని సాధించుకుంటామని హెచ్చరించారు. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి లు చిన్న పదవుల కోసం ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని ఆయన ఆరోపించా రు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే నీటి దోపిడీ జరు గుతోందని, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కలిసి సాగర్ రైతులకు అన్యాయం చేస్తున్నారని విమ ర్శించారు. మిర్యాలగూడలో నిర్వహించే రైతు మహాధర్నాతో ప్రభుత్వ వైఖరిని ప్రజల ముందు ఎండగడతామని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకులు అన్న భీమోదు నాగార్జున చారి, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ నాయ కులు చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్కుం, దూరు వీర కోటిరెడ్డి, కుర్ర సేవ్య నాయక్, చెవుగాని బిక్షం గౌడ్ టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు ఎండి సోయాబ్, గయాస్, రాజబోయిన గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో

# ఉత్తమ బ్యాంకింగ్ కరస్పాండెంట్లకు సత్కారం



**మహబూబ్‌నగర్ , (సింగిడి):** మహబూ బ్‌న గర్ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో సేవలంది స్తున్న బ్యాంకింగ్ కరస్పాండెంట్లకు (బీసీలు) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేక గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు మాట్లాడుతూ, బ్యాంకింగ్ సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాలకు సేవలను చేరవేయడం లో బీసీలు బ్యాంకులకు విస్తరించిన చేతుల వంటి వారని ప్రశంసించారు. ప్రజల ఇంటి వద్దకే ఆర్థిక సేవలను తీసుకెళ్లడంలో వారి పాత్ర అత్యంత



కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశేష సేవలందించిన పలువురు ఉత్తమ బీసీలను బ్యాంకు అధికారులు ఘనంగా సన్మానించి అభినందించారు. మహబూబ్‌నగర్ ప్రాంతీయ అధిపతి డి. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ. మురళీకృష్ణ మరియు ఇతర అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో, సమాజంలోని అన్ని వర్గాలకు ఆర్థిక సేవలను మరింత వేగంగా విస్తరించాలని పిలుపునిచ్చారు.

# మహబూబ్‌నగర్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్

## రూ. 25 కోట్ల రుణాల మంజూరు

**మహబూబ్‌నగర్, (సింగిడి):** మహబూ బ్ నగర్ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో యూనియ న్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఈ కస్టమర్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సద స్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు మాట్లా డుతూ, నూతన అంకుర సంస్థలు మరియు ఎంఎస్ఎం టఈల ప్రగతిలో బ్యాంకర్ పాత్ర ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. బ్యాంక్–ఖాతాదా రుల మధ్య పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బ్యాంకు రుణ సదుపాయాలను, రుణ ప్రక్రియ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపుని





చ్చారు. కార్యక్రమంలో భాగంగా నూతన వ్యాపారాల స్థాపన, విస్తరణ మరియు ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తూ రూ. 25.00 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలను పారిశ్రామికవేత్తలకు అందజేశారు. మహబూబ్‌నగర్ ప్రాంతీయ హెడ్ డి. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ. మురళీకృష్ణ, ఇతర అధికారులు, ఖాతాదారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ రంగాభివృద్ధికి బ్యాంకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# భూభారతి, అసైన్డ్ భూములు, ఎస్ఐఆర్, రీడ్ సర్వే పనులపై దృష్టి సారించాలి

## కలెక్టర్ బి చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, (సింగిడి):** భూభారతి, అసైన్డ్ భూములు, ఎస్ఐఆర్, రీ–సర్వే పనులపై అధికారులు ప్రతిరోజూ ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్తగా పని చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీ వోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 22ఏకు సంబంధించిన నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలని కలెక్టర్ చెప్పారు. అసైన్డ్ భూములు, సీలింగ్ భూములు, అటవీ భూములు, ప్రభుత్వ భూములు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన భూముల వివరాలను క్షేత్రస్థాయిలో



పరిశీలించి పూర్తి వివరాలను నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ ల్యాండ్స్, గ్రామకంఠం భూములు, ఇనాం భూములు తదితర భూములను సర్వే చేసి పూర్తి సమాచారం సేకరించాలని తెలిపారు. భూములకు సంబంధించిన రికార్డులను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రీ–సర్వే పనులు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, భూముల వివరాల నమోదు, సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ స్థాయిలో నోటీసులు జారీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలను గ్రామస్థాయిలో చదివి వినిపించా లన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే హబ్‌గా గద్వాల జిల్లా అభివృద్ధి

**గద్వాలలో మరో ఆర్ఓబి నిర్మాణానికి**
**రూ.66 కోట్ల నిధులు అమృత్ భారత్ పథకం**
**రూ.42.82 కోట్ల నిధులతో గద్వాల స్టేషన్ అభివృద్ధి**
**శరవేగంగా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు**
**గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కృషి**
**కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి**



**గద్వాల బ్యూరో (సింగిడి):** అమృత్ భారత్ పథకం ద్వారా మంజూరైన రూ. 42.82 కోట్ల నిధులతో గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం గద్వాల రైల్వే స్టేషన్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర మంత్రి పరిశీలించారు. స్టేషన్‌కు చేరుకున్న అతిథులకు అధికారులు, పలువురు నేతలు మేళ తాళాలతో, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా స్టేషన్ అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్లాట్ ఫామ్ పై తిరుగుతూ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైల్లోనీ ప్రయాణికులకు అభివాదం చేశారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న వివిధ పనులను గమనించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల రైల్వే స్టేషన్ లో అమృత్ భారత్ పథకం పనులు పూర్తయితే ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రైళ్లకు అదనంగా ఇతర రైళ్ల స్టాపింగ్ కు కృషి చేస్తానన్నారు. స్టేషన్లో ప్లాట్ఫార్మ్ విస్తరణ, పార్కింగ్ అభివృద్ధి, నూతన పరిపాలన భవనం, గద్వాల సంస్థానం సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా ముఖద్వారా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్టేషన్ వెనుక వైపు నుంచి కూడా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులకు సౌకర్యంగా మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైల్వే హబ్ గా జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి చెందుతుందనటంలో అతిశయోక్తి లేదన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ ప్రారంభమై వందేళ్లు దాటడంతో అమృత్ భారత్ పనులు పూర్తయ్యాక జిల్లా ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైల్వేకు సంబంధించి గడిచిన 10 ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులను ప్రయాణికులకు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వాలు ఏడాదికి రూ. 886 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2025–2026 సంవత్సరానికి రూ. 5454 కోట్ల నిధులను ఒక్క తెలంగాణకే కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2009–2014 సంవత్సరాల మధ్యన కేవలం 87 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు జరిగితే ప్రస్తుతం 888 కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టడం గర్వకారణమన్నారు. 21 రైల్వే ప్రాజెక్టులకు రూ. 50 వేల కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో 520 ఆర్ఓబి, ఆర్యుబి నిర్మాణాలను పూర్తి చేసామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 4883 కోట్ల నిధులతో 118 రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చేస్తున్నామన్నారు. గద్వాలలో రూ. 66 కోట్ల నిధులతో మరో ఆర్ఓబి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో 99 శాతం రైల్వే ట్రాక్స్ ను విద్యుద్దీకరించడం జరిగిందని, 100 కొత్త రైళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 174 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఉచితంగా హై స్పీడ్ వైఫై సౌకర్యాన్ని కల్పించామన్నారు. కాజీపేటలో నూతన సాంకేతికతను వినియోగించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా రైళ్ల బోగీల తయారీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. రైల్వే ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోందని, దేశవ్యాప్తంగా కవచ్ టెక్నాలజీనీ అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ఏడు బుల్లెట్ రైళ్లను ప్రకటిస్తే అందులో తెలంగాణ రాష్ట్రానికే మూడింటిని కేటాయించడం గర్వకారణంగా ఉందన్నారు. వీటిని హైదరాబాదు నుంచి పూణే, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడపడంతో రాష్ట్రం గేమ్ చేంజర్ గా మారుతుందని చెప్పారు. హై స్పీడ్ రైల్ ఎలివేటెడ్ క్యారిడార్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, దాంతో వివిధ ప్రాంతాలకు తక్కువ సమయంలోనే ప్రయాణికులు రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుందని ఫలితంగా హైదరాబాద్ కు ప్రపంచవ్యాప్త పెట్టుబడులు పెరుగుతాయని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందని, ఫలితంగా భక్తుల సంఖ్య కూడా పెరగడంతో క్షేత్ర విశిష్టత ఇనుమడిస్తుందన్నారు. విమానాశ్రయాలను తలపించేలా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వందేళ్లు పూర్తి చేసుకున్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే అన్ని రైళ్లు ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గద్వాల – డోర్నకల్, మాచర్ల – గద్వాల రైల్వే లైన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. డబ్లింగ్ పనులు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల సంస్థానాధీశులు ఇక్కడ రైల్వే స్టేషన్ నిర్మాణానికి 100 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించడంతో మిగిలిన స్థలంలో భవిష్యత్తులో రైల్వే ప్రాజెక్టులను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గద్వాల పేరు చెప్పగానే మొదట ఇక్కడి చేనేత జరీ చీరలు గుర్తొస్తాయని, రైల్వే కనెక్టివిటీ సౌకర్యాలు మెరుగుపడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గద్వాల జిల్లా కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ అంతర్ రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్ వెలుపల ఉన్న వాహనాల పార్కింగ్ స్టాండ్‌లో ప్రయాణికుల నుంచి అధిక రుసుములను వసూలు చేయడం తగదని, తగ్గించాల్సిందిగా రైల్వే అధికారులను కోరారు. గద్వాల రైల్వే స్టేషన్ లో అన్ని రైళ్ళను ప్రయాణికులు సద్వినియోగం చేసుకునేలా స్టాపింగ్ ఉండాలని, ఆధునికీకరణకు నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందజేశారు. అలాగే పలువురు ప్రజాసంఘాల నేతలు గద్వాల ప్రాంత అభివృద్ధిని కోరుతూ మంత్రికి వినతి పత్రాలను అందించారు. ఈ పర్యటనలో రైల్వే డిఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి

## కలెక్టర్ కె. హరిత

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి రహదారి భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట వద్ద అంతర్రాష్ట్ర వంతెనపై భారీ వాహ నాల రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలోని రహదారుల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై సీసీ కెమెరాలు, వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించేలా




సమన్వయం చేసుకోవాలన్నారు. రహదారులపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వాహనదారులు తప్పనిసరిగా సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించేలా అవగాహనతో పాటు నిబంధనల అమలుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, చెన్నూరి కిష్టయ్య, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సుహానా డ్రెస్సులు
# ఎంత ఖరీదో !

బాలీవుడ్ సెలెబ్రిటీల్లో ఫ్యాషన్ ఐకాన్లుగా పేరుతెచ్చుకున్నవారిలో అగ్ర నటుడు షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కూడా ఉంటారు. ఆమె ఏ కార్యక్రమంలో పాల్గొన్నా ప్రత్యేక వస్త్రధారణతో అందరినీ ఇట్టే ఆకర్షిస్తుంటారు. ఇటీవల జరిగిన ఓ ఫ్యాషన్ ఈవెంట్లోనూ ఆమె ఖరీదైన దుస్తుల్లో మెరిసిపోయారు ఆమె దుస్తుల గురించి నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. వాటి ధరెంతో తెలుసుకొని అవాక్కవుతున్నారు. సుహానా ఇటీవల ప్రముఖ డిజైనర్ సంస్థ కార్టియర్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అందులో భాగంగా అలెక్స్ పెర్రీ రూపొందించిన స్ట్రాప్‌లెస్ కాలమ్ డ్రెస్‌తో పాటు, లేస్-ట్రిమ్ సిల్క్ కాడీ శాటిన్ మినీ డ్రెస్ ధరించి వహ్వా అనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను సుహానా ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఇందులో స్ట్రాప్‌లెస్ కాలమ్ డ్రెస్ ధర సుమారు రూ.2.15 లక్షలట! వామ్మో అంత ఖరీదా అని ఆశ్చర్యపోతున్నారా? ఆగండాగండి. రెండో డ్రెస్ ఖరీదు తెలిస్తే నోరెళ్లబెడతారు. అదెంతో తెలుసా? ఏకంగా రూ.6.6 లక్షలట! ధర ఎంతైనా ఫ్యాషన్ విషయంలో సుహానా రాజీపడరని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.






## క్యాన్సర్ పుకార్లను
# తోసిపుచ్చిన నటి ప్రేమ

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన




ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు.

జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు. క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# 'ఏష నాగుల కట్ట మీద'.
## అదరగొడుతున్న ప్రభ బంగారిగళ్ల

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' నుంచి ఇటీవల విడుదల చేసిన 'ఏష నాగుల కట్ట మీద..' పాటకు మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా గాయని ప్రభ బంగారిగళ్ళ గాత్రం ఈ పాటకు మరింత వన్నె తెచ్చింది. జానపద గాయనిగా సోషల్ మీడియాలో ఆమెకు మంచి గుర్తింపు ఉంది. వినాయక చవితి, దసరా లాంటి పండుగల సమయంలో వాడవాడలా ఆమె పాటలు మార్మోగుతుంటాయి. ఎక్కడా శిక్షణ తీసుకోకుండా తన తల్లి వద్దే ఆమె పాటలు నేర్చుకున్నారట. వీనులవిందైన జానపద గానంతో ఇప్పుడు వెండితెరపై అవకాశాలూ దక్కించుకుంటున్నారు.

యూట్యూబ్‌లో, స్థానిక వేడుకల్లో జానపదాలు పాడుతూ అభిమానులను సంపాదించుకున్నారు ప్రభ. ఆమె ప్రతిభ దర్శకుల దృష్టిని ఆకర్షించడంతో సినిమా అవకాశాలు తలుపుతట్టాయి. ఇటీవల విశాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మకుటం'లోని 'నచ్చాకే వచ్చారా..' పాటను ప్రభ ఆలపించారు. 'ది ప్యారడైజ్'లో ఆమె పాడిన 'ఏష నాగుల' పాటకు ఇప్పటికే 35 మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. ఆమె గతంలో పాడిన పాటలూ యూట్యూబ్‌లో అదరగొడుతున్నాయి.

'సిటా పటా సినుకులకు ఏడ తిన్నవురో రాతిరి' పాటతో ప్రభ గాయనిగా ఫేమస్ అయ్యారు. ఈ సాంగ్‌ని ఇప్పటివరకూ



యూట్యూబ్‌లో 143 మిలియన్ల వీక్షణలు వచ్చాయి. ఆ తర్వాత ఆమె పాడిన 'జొన్నలన్న జొనపటన్న తిందురావయ్య బుక్కెడు..' పాట 22 మిలియన్ వ్యూస్ సాధించింది. 'నిమ్మతోట వనములో..రారా ముద్దుల బావయ్యా..' సాంగ్ 160 మిలియన్ల వీక్షణలతో విశేషంగా ఆకట్టుకుంది. 'ఓ పిలగ వెంకటేశు .. సూడక పోతుంటవో' ఖీబశ్రీశ్రీ రాశీఅస్త్ర పాటకి 390 మిలియన్ల వీక్షణలు వచ్చాయి. 'రింగు రింగూల జుట్టు దాన..'కు 102 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఆమె పాడిన 'రావు ఎల్లమ్మ రావు రావో..', 'నా పేరే ఎల్లమ్మ.. నేను జోగురాలమ్మో..' పాటలు పండగలకు మార్మోగుతుంటాయి. 'గూజారి గూజారి మామిండ్ల కింద..' అనే పాట అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఇలా పల్లె నుంచి వెండితెర దాకా ప్రభ తనదైన గాత్రంతో అదరగొడుతున్నారు.

## షూటింగ్ సెట్‌లోకి
# అడుగుపెట్టిన రష్మిక



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసు కుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమా నులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేం దుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737